

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 18-01-2026 | సంపుటి - 26 | సంచిక -239 | రూ : 4 | పేజీలు: 8




2లో

### 25 ఏళ్లు కష్టపడి చదివితే 75 ఏళ్ల వరకు

## గౌరవంగా జీవించవచ్చు

- తొలి ప్రధాని నెహ్రూ సాగునీటి ప్రాజెక్టులు, విద్యకు ప్రాధాన్యత ఇచ్చారని వెల్లడి
- తమ ప్రభుత్వం కూడా వాటికే ప్రాధాన్యత ఇస్తోందన్న ముఖ్యమంత్రి
- విద్యతోనే సమాజంలో గౌరవం లభిస్తుందన్న ముఖ్యమంత్రి

### బడి ఫీజు

## రెండేళ్లకు 8% పెంచుకోవచ్చు!

- అంతకంటే ఎక్కువ కావాలనుకుంటే రాష్ట్ర కమిషన్‌కు దరఖాస్తు చేసుకోవాలి
- ఫీజుల నియంత్రణ చట్టం బిల్లు సిద్ధం
- వచ్చే మంత్రిమండలి సమావేశంలో చర్చ



2లో

### ఎన్‌కౌంటర్‌లో కోటి రూపాయల రివార్డ్ ఉన్న

## మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు మృతి


2లో


- బీజాపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్
- ఇద్దరు మావోయిస్టుల హతం
- మృతుల్లో మావో నేత పాపారావు అలియాస్ మోంగు

### చైనా స్కూలులో

## నోరో వైరస్ కలకలం..

### వంద మందికి పైగా సోకిన వైరస్


- గ్వాంగ్ డాంగ్ ప్రావిన్స్ లోని స్కూలులో 103 మంది విద్యార్థులకు నోరో వైరస్
- అప్రమత్తమైన అధికారులు.. స్కూలు చుట్టుపక్కల వైద్య పరీక్షలు చేస్తున్నట్లు వెల్లడి
- స్కూలు మొత్తం వైరస్ ను నాశనం చేసే మందులు స్ప్రే చేసిన అధికారులు



2లో

## యాడ్స్ విషయంలో కీలక నిర్ణయం తీసుకున్న చాట్‌జీపీటీ

- ప్రకటనల బాట పట్టబోతున్న చాట్‌జీపీటీ
- నిర్వహణ ఖర్చులను ఎదుర్కొనేందుకు యాడ్స్ ను పరీక్షించనున్నట్లు ప్రకటన
- ఫ్రీ, తక్కువ స్థాయి సబ్‌స్క్రిప్షన్ వినియోగదారులకు మాత్రమే కనిపించనున్న యాడ్స్



2లో

### బీహార్‌లో గెలిచాం..

## బెంగాల్‌కు సమయం ఆసన్నమైంది


2లో

- ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో మమత ప్రభుత్వం విఫలమైందని విమర్శ
- బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్న నరేంద్ర మోదీ
- కేంద్రం ఇస్తున్న నిధులను మమతా బెనర్జీ కొల్లగొడుతోందని విమర్శ

### కాకినాడలో ఏఎమ్ గ్రీన్ ప్రాజెక్టుకు


## శంకుస్థాపన చేసిన సీఎం, డిప్యూటీ సీఎం

- కాకినాడలో రూ.18 వేల కోట్ల ఏఎమ్ గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టుకు శంకుస్థాపన
- రాష్ట్రానికి ఈ ప్రాజెక్టు గేమ్ ఛేంజర్ అవుతుందన్న సీఎం చంద్రబాబు
- ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ అమ్మోనియా పరిశ్రమగా రూపకల్పన
- 2027 జూన్ నాటికి ప్రాజెక్టు తొలి దశ ఉత్పత్తి ప్రారంభం
- రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ప్రకటన



2లో

# బడి ఫీజు రెండేళ్లకు 8% పెంచుకోవచ్చు!



హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలలు ట్యూషన్ ఫీజును రెండేళ్లకు ఒకసారి 8 శాతం పెంచుకునేలా అనుమతించాలని ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. అంతకంటే ఎక్కువ పెంచుకోవాలనుకుంటే ప్రభుత్వం నియమించే రాష్ట్రస్థాయి కమిషన్ ఆమోదం పొందాల్సి ఉంటుంది. ఈ మేరకు ఫీజుల నియంత్రణ చట్టం విధివిధానాలను రూపొందించారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత జరిగే మంత్రిమండలి సమావేశంలో దీనిపై చర్చించి... చట్టాన్ని తీసుకొస్తామని విద్యాశాఖ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. విద్యారంగ సమస్యలపై 2024 జులైలో శ్రీధర్‌బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్‌లతో మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటైంది. ఆ కమిటీ ఫీజులపై రెండుసార్లు చర్చించింది. ఆ తర్వాత తెలంగాణ విద్యా కమిషన్‌ను ప్రభుత్వం నియమించింది. రుసుముల నియంత్రణపై అధ్యయనం చేసిన విద్యా కమిషన్.. తెలంగాణ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ ముసాయిదా బిల్లు 2025 పేరిట గతేడాది జనవరి 24న ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. దీనిపై మంత్రివర్గ ఉప సంఘం చర్చించి... ముఖ్యాంశాలను ముఖ్యమంత్రికి సమర్పించింది. రెండేళ్లకు ఒకసారి 8 శాతం ఫీజు పెంపునకు అనుమతించాలనేది ఇందులో ప్రధాన సిఫార్సు.

**యజమానుల అభ్యంతరం...**

* ఆచార్య తిరుపతిరావు కమిటీ 2017లో ప్రతి సంవత్సరం 10 శాతం వరకు పెంచుకోవచ్చని సూచించగా... తెలంగాణ విద్యా కమిషన్ ఏటా వినియోగదారుల ధరల సూచిక (సీపీఐ) ఆధారంగా ఫీజులు పెంచుకునే అవకాశం ఇవ్వాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. విద్యాశాఖ ఉన్నతాధికారులు మాత్రం రెండేళ్లకు 8 శాతం పెంచుకునేలా విధి విధానాలు రూపొందించారు. కమిషన్ ఆమోదం తీసుకుంటే అంతకంటే ఎక్కువ పెంచుకోవచ్చని చెబుతున్నారు.
* ప్రతి సంవత్సరం ఫీజుల పెంపునకు అనుమతించాలని పాఠశాలల యజమానులు డిమాండ్ చేస్తున్నారు. ఈక్రమంలోనే మంత్రివర్గ ఉపసంఘం ఛైర్మన్ శ్రీధర్‌బాబుతో ఇటీవల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ఆధ్వర్యంలో పలువురు పాఠశాలల యజమానులు సమావేశం కావాల్సి ఉండగా... చివరి నిమిషంలో వాయిదా పడింది.
* అనేక రాష్ట్రాల్లో ఏడాదికోమారు పెంపు విధానమే ఉందని కొందరు నిపుణులు చెబుతున్నారు. ద్రవ్యోల్బణం ఏటా 56 శాతం పెరుగుతుండగా... రెండేళ్లకు 8 శాతం పెంపు ఎలా సరిపోతుందని ప్రశ్నిస్తున్నారు. తాము ఏటా అద్దె చెల్లించాలని, ఉపాధ్యాయుల వేతనాలు పెంచాల్సి ఉంటుందని పాఠశాలల యాజమాన్యాలు పేర్కొంటున్నాయి.
* ఇంజినీరింగ్ తదితర ఉన్నత విద్య కళాశాలలు మూడేళ్లకోసారి ఫీజులు పెంచుతున్నా... అక్కడ యాజమాన్య కోటా ఉంటుందని, ఆ సీట్లను ప్రభుత్వం నిర్ధారించిన ఫీజుకు ఇవ్వడం లేదు కదా అని ప్రశ్నిస్తున్నాయి.

## యాడ్స్ విషయంలో కీలక నిర్ణయం తీసుకున్న చాట్‌జీపీటీ

జనవరి 17 : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచంలో సంచలనం సృష్టించిన చాట్‌జీపీటీ ఇకపై ప్రకటనల బాట పట్టబోతోంది. ఓపెన్ ఏఐ విలువ 500 బిలియన్ డాలర్లకు పెరిగినప్పటికీ భారీగా పెరుగుతున్న నిర్వహణ ఖర్చులను ఎదుర్కొనేందుకు వచ్చే కొన్ని వారాల్లో చాట్‌జీపీటీలో అడ్వర్టైజ్‌మెంట్లను పరీక్షించనున్నట్లు ఓపెన్‌ఏఐ ప్రకటించింది. మొదట అమెరికాలో ఫ్రీ, తక్కువ స్థాయి సబ్‌స్క్రిప్షన్ వినియోగదారులకు మాత్రమే ఈ ప్రకటనలు కనిపించనున్నాయి. అయితే ప్రో, ఎంటర్‌ప్రైజ్ యూజర్లకు మాత్రం యథావిధిగా యాడ్స్ ఉండవని సంస్థ స్పష్టం చేసింది. దాదాపు బిలియన్ మంది వినియోగదారులు ఉన్నప్పటికీ, చాలా తక్కువ మంది మాత్రమే చెల్లింపు సేవలు వినియోగిస్తుండటంతో కొత్త ఆదాయ మార్గాల అవసరం ఏర్పడింది. శక్తిమంతమైన కంప్యూటింగ్ వ్యవస్థల కోసం భారీగా ఖర్చవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ప్రకటనలు చాట్‌జీపీటీ సమాధానాలను ప్రభావితం చేయవని, యూజర్ల వ్యక్తిగత డేటా ప్రకటనదారులకు అందుబాటులో ఉండదని ఓపెన్‌ఏఐ హామీ ఇచ్చింది. యూజర్ నమ్మకం, అనుభవమే తమకు మొదటి ప్రాధాన్యమని సంస్థ మరోసారి స్పష్టం చేసింది.

## 25 ఏళ్లు కష్టపడి చదివితే 75 ఏళ్ల వరకు గౌరవంగా జీవించవచ్చు

హైదరాబాద్: 25 ఏళ్లు కష్టపడి చదివితే 75 ఏళ్ల వరకు గౌరవంగా జీవించవచ్చని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, చిట్టబోయినపల్లి ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తొలి ప్రధానమంత్రి నెహ్రూ సాగునీటి ప్రాజెక్టులు, విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం కూడా వాటికే ప్రాధాన్యతనిస్తుందని స్పష్టం చేశారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ హయాంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులే నేటికీ జీవనాధారంగా నిలుస్తున్నాయని అన్నారు. భూగరిష్ఠ పరిమితి చట్టం తీసుకురావడం ద్వారా కాంగ్రెస్ దొరల వద్ద ఉన్న లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిందని గుర్తు చేశారు. విద్యతోనే సమాజంలో గౌరవం లభిస్తుందని గుర్తించాలని సూచించారు. నిబద్ధత లేని చదువు వల్ల ప్రయోజనం ఉండదని అన్నారు.

## బీహార్‌లో గెలిచాం.. బెంగాల్‌కు సమయం ఆసన్నమైంది

బీహార్: బీహార్‌లో ఎన్డీయే విజయం సాధించిందని, ఇక పశ్చిమ బెంగాల్‌కు సమయం ఆసన్నమైందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. బెంగాల్ పర్యటనలో భాగంగా మాల్దాలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో మమతా బెనర్జీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను మమతా బెనర్జీ ప్రభుత్వం కొల్లగొడుతోందని మోదీ ఆరోపించారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి హింస, బుజ్జగింపు రాజకీయాలు కావాలని ఆయన విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆయన నొక్కి చెప్పారు. రాష్ట్రానికి అసలైన సవాల్ చొరబాటుదారులేనని మోదీ పేర్కొన్నారు. చొరబాట్లను అరికట్టడంలో తృణమూల్ ప్రభుత్వం విఫలమైందని ఆయన దుయ్యబట్టారు. మాల్దా, ముర్షిదాబాద్ వంటి ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగడానికి చొరబాట్లే కారణమని ఆయన ఆరోపించారు. బెంగాల్ రాష్ట్రానికి వరద సహాయ నిధులను కేంద్రం 40 సార్లు అందించినా, ఆ నిధులు అసలైన లబ్ధిదారులకు చేరలేదని ప్రధానమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. బెంగాల్ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చే బీజేపీ ప్రభుత్వం ఇక్కడ అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తున్నారని ఆయన అన్నారు.

## భారత్, పాకిస్థాన్‌లతో సంబంధాలపై అమెరికా రిపబ్లికన్ పార్టీ నేత కీలక వ్యాఖ్యలు

అమెరికా: భారత్, పాకిస్థాన్‌లతో అమెరికా సంబంధాలపై ఆ దేశ కాంగ్రెస్ సభ్యుడు, రిపబ్లికన్ పార్టీ నేత రిచ్ మెక్‌కార్మిక్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా.. పాకిస్థాన్‌తో కంటే భారత్‌తో సంబంధాలను బలోపేతం చేసుకోవాలని ఆయన సూచించారు. అమెరికాకు పెట్టుబడులను తీసుకొచ్చేది భారత్ తప్ప పాకిస్థాన్ కాదనే విషయాన్ని గుర్తించాలని అన్నారు. ప్రతిభావంతులైన నిపుణులను, ఉద్యోగులను భారత్ అమెరికాకు పంపిస్తోందని ఆయన పేర్కొన్నారు. అమెరికా అభివృద్ధిలో భారతదేశం, అక్కడి నిపుణులు, ఉద్యోగుల పాత్ర ఎంతో ఉందని ఆయన వ్యాఖ్యానించారు. భారత్‌కు చెందిన కంపెనీలు అమెరికాలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తాయని అన్నారు. భారత్‌ను అమెరికా దూరం చేసుకోకూడదని, ఒకవేళ అదే జరిగితే అమెరికాకే నష్టమని ఆయన పేర్కొన్నారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికను భారత్ లెక్కచేయడం లేదని, ఇది అధ్యక్షుడి ఆగ్రహానికి కారణమైందని ఆయన అన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేయవద్దని ట్రంప్ హెచ్చరించినప్పటికీ భారత్ మాత్రం కొనుగోళ్లను ఆపడం లేదని గుర్తు చేశారు. ఇది నచ్చని ట్రంప్, భారత్ పట్ల కఠిన వైఖరిని అవలంభిస్తున్నారని వ్యాఖ్యానించారు. కానీ భారతదేశం ప్రయోజనాల గురించి ఆలోచించిన ప్రధాని నరేంద్ర మోదీ ఎవరి మాటను లెక్క చేయకుండా రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తున్నారని తెలిపారు.

## కాకినాడలో ఏఎమ్ గ్రీన్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

కాకినాడ: ఆంధ్రప్రదేశ్‌ను 'గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ'గా తీర్చిదిద్దడమే లక్ష్యమని, పర్యావరణహిత ఇంధన ఉత్పత్తిలో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలుపుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కాకినాడలో సుమారు రూ.18 వేల కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న 'ఏఎమ్ గ్రీన్ అమ్మోనియా' ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు రాష్ట్ర భవిష్యత్తుకు ఒక 'గేమ్ ఛేంజర్'గా నిలవనుందని, ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ అమ్మోనియా పరిశ్రమగా ఇది చరిత్ర సృష్టించనుందని అన్నారు. భవిష్యత్తు మొత్తం గ్రీన్ ఎనర్జీదేనని, ఈ క్రమంలో గ్రీన్ అమ్మోనియా కీలక పాత్ర పోషించనుందని చంద్రబాబు వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా హరిత ఇంధన ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నారని గుర్తుచేశారు. "2014లోనే మా ప్రభుత్వం గ్రీన్ ఎనర్జీకి నాంది పలికింది. ఇప్పుడు గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియాతో మరో ముందడుగు వేస్తున్నాం. 2027 జూన్ నాటికి ఈ ప్రాజెక్టు మొదటి దశ ఉత్పత్తి ప్రారంభమవుతుంది" అని ఆయన ప్రకటించారు. బొగ్గు వినియోగం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోందని, కాలుష్యం కారణంగా సముద్ర జీవావరణంలో పెను మార్పులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న సహజ వనరులు గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ఎంతో అనుకూలమని ముఖ్యమంత్రి తెలిపారు. వెయ్యి కిలోమీటర్ల సుదీర్ఘ సముద్ర తీరం, రానున్న 20 పోర్టులు, రాష్ట్రంలో పుష్కలంగా లభించే సౌర, పవన విద్యుత్ వనరులు మనకు వరమని పేర్కొన్నారు. సాంస్కృతిక విలువలను కాపాడుకుంటూనే, ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు. ఎంత ఎత్తుకు ఎదిగినా సొంత ఊరిని మర్చిపోకూడదని హితవు పలికారు. గొప్ప ఆలోచనలను ఆచరణలో పెట్టేవారు అరుదుగా ఉంటారని, అలాంటి వారిలో పారిశ్రామికవేత్త చలమలశెట్టి అనిల్ ఒకరని ప్రశంసించారు. గతంలో ఎన్టీఆర్ చొరవతోనే కాకినాడకు నాగార్జున ఫెర్టిలైజర్స్ పరిశ్రమ వచ్చిందని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. భవిష్యత్తులో ఈ గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టుతో కాకినాడ పేరు ప్రపంచవ్యాప్తంగా మారుమోగుతుందని ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మేలు చేసే ఏ నిర్ణయాన్నైనా తక్షణమే అమలు చేస్తుందని స్పష్టం చేశారు. "2047 నాటికి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా చూడాలన్నదే నా ఆకాంక్ష. గ్రీన్ అమ్మోనియా వల్ల వ్యవసాయ రంగానికి ఎంతో మేలు జరుగుతుంది. ప్రకృతి సేద్యం పెరగడమే మనందరి ఆరోగ్యానికి శ్రీరామరక్ష" అని అన్నారు. రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించాలని రైతులకు పిలుపునిచ్చారు. ఇక్కడ ఉత్పత్తి అయ్యే గ్రీన్ అమ్మోనియాను ఏ దేశానికైనా ఎగుమతి చేసే వీలుంటుందని, ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు గొప్ప బలాన్ని ఇస్తుందని వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు, కాకినాడ ప్రాంతం ఒక కీలక పారిశ్రామిక, హరిత ఇంధన కేంద్రంగా అభివృద్ధి చెందనుంది.

## చరిత్ర తిరగరాయటం తెలుగువాళ్లతోనే సాధ్యం

అమరావతి: చరిత్రను తిరగరాయడం తెలుగువాళ్లకే సాధ్యమని, ప్రపంచ గతిని మార్చే శక్తిసామర్థ్యాలు మనవారికి ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ సత్తాను చాటేలా, ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా ప్రాజెక్టుకు కాకినాడ వేదిక కావడం తెలుగువారందరికీ గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. గ్రీన్‌కో అనుబంధ సంస్థ ఏఎమ్ గ్రీన్ ఆధ్వర్యంలో కాకినాడలో ఏర్పాటు చేస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి చంద్రబాబు ఇవాళ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుతో ఇకపై ప్రపంచం మొత్తం కాకినాడ వైపు చూస్తుందని, భవిష్యత్ ఇంధన రంగంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించనుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "గతంలో ఇదే ప్రాంతంలో నాగార్జునా ఫెర్టిలైజర్స్ గ్రే అమోనియా తయారు చేస్తే, ఇప్పుడు అదే చోట పర్యావరణహితమైన గ్రీన్ అమోనియా ఉత్పత్తి కాబోతోంది. ఇది మార్పునకు సంకేతం. చరిత్రను తిరగరాయడం అంటే ఇదే. తెలుగువాళ్లు తలచుకుంటే ఏదైనా సాధించగలరు. గత ఏడాది ఈ ప్రాజెక్టుకు అనుమతిస్తే, సరిగ్గా ఏడాది తిరిగేసరికి పనులు ప్రారంభించడం మన పనితీరుకు నిదర్శనం. ఇది స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు చక్కటి ఉదాహరణ" అని అన్నారు. 495 ఎకరాల్లో, 2 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో ఈ ప్లాంట్‌ను నిర్మిస్తున్నారని వెల్లడించారు. 2027 జూన్ నాటికి ఉత్పత్తి ప్రారంభించి, ఏడాదికి 1.5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ అమోనియాను ఇక్కడి నుంచి జర్మనీ వంటి దేశాలకు ఎగుమతి చేయనున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నిర్దేశించిన 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యాన్ని అందిపుచ్చుకుని, రాష్ట్రంలో 160 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేశామని చంద్రబాబు తెలిపారు. "సౌర, పవన, జల విద్యుత్‌తో పాటు పంప్డ్ స్టోరేజీకి ఏపీ అత్యంత అనుకూలమైన రాష్ట్రం. మనకున్న సుదీర్ఘ తీరప్రాంతం, రాబోయే 20 పోర్టులతో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా ఉత్పత్తికి ఏపీ కేంద్రంగా మారుతుంది. భవిష్యత్తులో గ్రీన్ ఎనర్జీపై ఎక్కడ చర్చ వచ్చినా కాకినాడ పేరు వినిపిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన 'క్లీన్, గ్రీన్ ఇంటిగ్రేటెడ్ ఎనర్జీ పాలసీ 2024' దేశంలోనే అత్యుత్తమమైనదని, పారిశ్రామికవేత్తలకు పూర్తి స్వేచ్ఛనిస్తూ, ఒక్క నిమిషం కూడా ఆలస్యం చేయకుండా అనుమతులు మంజూరు చేస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ, "విశాఖలో గూగుల్ సంస్థ 1 గిగావాట్ సామర్థ్యంతో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఈ ఏడాదిలోనే అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలు అందుబాటులోకి వస్తాయి. స్పేస్ టెక్నాలజీలో కూడా పురోగతి సాధిస్తాం. ఆంధ్రప్రదేశ్‌ను నాలెడ్జ్ ఎకానమీ హబ్‌గా తీర్చిదిద్దుతాం" అని ముఖ్యమంత్రి ప్రకటించారు. రాష్ట్రంలో పరిశ్రమలపై విద్యుత్ కొనుగోలు భారాన్ని యూనిట్‌కు రూ.1.19 మేర తగ్గించేందుకు కృషి చేస్తున్నామని, ఇప్పటికే 29 పైసలు తగ్గించామని తెలిపారు. గ్లోబల్ సంస్థలన్నీ ఏపీ నుంచి తమ కార్యకలాపాలు నిర్వహించాలని పిలుపునిచ్చిన ఆయన, రాష్ట్రంలోకి వచ్చే ప్రతి పెట్టుబడికి ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

## చైనా స్కూలులో నోరో వైరస్ కలకలం.. వంద మందికి పైగా సోకిన వైరస్

చైనా : చైనాలోని ఓ స్కూలులో వైరస్ కలకలం రేగింది. వంద మందికి పైగా విద్యార్థులు అనారోగ్యానికి గురికావడంతో వైద్యాధికారులు రంగంలోకి దిగి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో 103 మంది విద్యార్థులకు 'నోరా వైరస్' సోకినట్లు తేలింది. దీంతో అప్రమత్తమైన అధికార యంత్రాంగం.. క్లాస్ రూమ్ లతో పాటు స్కూలు ఆవరణలో వైరస్ ను నాశనం చేసే మందును చల్లారు. వైరస్ బాధిత విద్యార్థులకు చికిత్స అందజేస్తూనే మిగతా విద్యార్థులకు వైరస్ సోకకుండా చర్యలు చేపట్టారు. బాధిత విద్యార్థులు అందరూ కోలుకుంటున్నారని వివరించారు. రోజూ విద్యార్థుల ఆరోగ్యాన్ని పరీక్షిస్తూ ప్రత్యేక హాజరు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్కూలు పరిసరాల్లోని నివాస సముదాయాల్లో ఉంటున్న వారికి వైరస్ పరీక్షలు చేపట్టినట్లు వివరించారు. గ్వాంగ్ డాంగ్ ప్రావిన్స్ డిసీజ్ కంట్రోల్ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఏటా అక్టోబర్ నుంచి మార్చి మధ్య ప్రావిన్స్ లో నోరో వైరస్ విజృంభిస్తుందని అధికారులు తెలిపారు. వైరస్ బాధితులు ప్రధానంగా వాంతులు, విరేచనాలతో బాధపడుతుంటారని చెప్పారు. ఈ వైరస్ సాధారణమైందేనని, వైరస్ వ్యాప్తి చాలా వేగంగా ఉంటుందని వివరించారు. ఈ వైరస్ ను తొలిసారి 1968 లో అమెరికాలోని ఓహియో రాష్ట్రం నార్ వాక్ లోని ఓ స్కూలులో గుర్తించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఈ వైరస్ ను నోరో వైరస్ గా వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు. అమెరికాలో ఎక్కువగా ఆహారం ద్వారా ఈ వైరస్ వ్యాపిస్తుందని చెప్పారు. ఏటా ప్రపంచవ్యాప్తంగా 68.5 కోట్ల మంది ఈ వైరస్ బారిన పడుతుండగా.. అందులో 20 కోట్ల మంది ఐదేళ్లలోపు చిన్నారులేనని గణాంకాలు చెబుతున్నాయి. ఈ వైరస్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏటా 50 వేల మంది చిన్నారులు సహా 20 లక్షల మంది మృత్యువాత పడుతున్నారని సమాచారం.

## ఎన్‌కౌంటర్‌లో కోటి రూపాయల రివార్డ్ ఉన్న మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు మృతి

ఛత్తీస్గఢ్: మావోయిస్టు పార్టీకీ మరో కీలక ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు హతమయ్యారు. వీరిలో దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు, మోస్ట్ వాంటెడ్ నేత పాపారావు అలియాస్ మోంగు ఉన్నాడు. దక్షిణ బస్తర్ ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాలకు వ్యూహకర్తగా పాపారావు వ్యవహరిస్తున్నారు. ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్లలో సీనియర్ నేతలు మృతి చెందిన తర్వాత మిగిలిన టాప్ లీడర్లలో ఒకరిగా పాపారావు కొనసాగుతున్నాడు. పాపారావు కదలికలపై సమాచారం అందడంతో ఇంద్రావతి నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా దళాలు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టాయి. ఈ సందర్భంగా జరిగిన కాల్పుల్లో పాపారావుతో పాటు మరో మావోయిస్టు మరణించాడు. పాపారావుపై కోటి రూపాయల వరకు రివార్డు ఉంది. ఘటన స్థలంలో ఏకే రైఫిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. గతేడాది ఈ అడవుల్లోనే తప్పించుకున్న పాపారావు, ఇప్పుడు అదే ప్రాంతంలో మృతి చెందడం గమనార్హం.

# కొత్తగూడెం, అశ్వారావుపేట, ఇల్లందు మున్సిపాలిటీ కార్పొరేషన్ వార్డుల రిజర్వేషన్లు ఖరారు

*** జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి జితేష్ వి. పాటిల్.**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్, అశ్వారావుపేట మున్సిపాలిటీ , ఇల్లందు మున్సిపాలిటీ వార్డుల రిజర్వేషన్ ప్రక్రియను శనివారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి. పాటిల్ లాటరీ పద్ధతిలో నిర్వహించామని జిల్లా కలెక్టర్ తెలిపారు, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు , నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకతతో రిజర్వేషన్ ప్రక్రియను చేపట్టినట్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారుల సమక్షంలో లాటరీ ప్రక్రియ పూర్తయినట్లు స్పష్టం చేశారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం 60 వార్డులకు గాను ఎస్టీ 11, ఎస్సీ 12, బీసీ 7, సాధారణ మహిళలు 30 , అన్‌రిజర్వ్డ్ 14 వార్డులు ఉన్నాయి. ఎస్టీ వార్డులు 20, 34, 9, 33, 23, 19, 3, 48, 31, 52, 32 గా ఖరారు అయ్యాయని తెలిపారు. వీటిలో మహిళలు 34, 52, 31, 23, 9, జనరల్ వర్గానికి 20, 33, 19, 3, 48, 32 అనుగుణంగా ఉన్నాయి. ఎస్సీ వార్డులు 18, 47, 24, 13, 26, 17, 43, 15, 12, 27, 35, 28; మహిళలు 18, 13, 27, 15, 12, 35, జనరల్ 47, 24, 26, 17, 43, 28 గా ఉన్నాయి. బీసీ వార్డులు 46, 59, 21, 60, 30, 55, 53; మహిళలు 46, 60, 21, జనరల్ 59, 30, 55, 53. సాధారణ మహిళలు 10, 5, 11, 54, 36, 7, 22, 4, 56, 8, 41, 37,57,2,1,16 అన్‌రిజర్వ్డ్ వార్డులు 5, 6, 14, 25, 29, 38, 39, 40, 42, 44, 45, 49, 50, 58 గా నిర్ణయించబడ్డాయి.




అశ్వారావుపేట మున్సిపాలిటీ 22 వార్డులతో ఎస్టీ 3 (12, 14, 9) వార్డులు, వీటిలో మహిళ 12, జనరల్ 14, 9. ఎస్సీ 4 (2, 21, 7, 22), మహిళలు 2, 21, జనరల్ 7, 22. బీసీ 4 (1, 3, 4, 5), మహిళలు 4, 5, జనరల్ 1, 3. సాధారణ మహిళలు 6 (6, 8, 15, 16, 17, 20), అన్‌రిజర్వ్డ్ 5 (10, 11, 13, 18, 19) గా ఖరారు అయ్యాయి.

ఇల్లందు మున్సిపాలిటీ 24 వార్డులతో ఉంది. ఎస్టీ 2 (3, 11), మహిళ 11, జనరల్ 3. ఎస్సీ 4 (12, 14, 21, 24), మహిళలు 12, 24, జనరల్ 14, 21. బీసీ 6 (2, 9, 10, 13, 15, 17), మహిళలు 2, 9, 15, జనరల్ 10, 13, 17. సాధారణ మహిళలు 6 (4, 5, 6, 16, 18, 19), అన్‌రిజర్వ్డ్ 6 (1, 7, 8, 20, 22, 23) గా ఖరారు అయ్యాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ వివరించారు, ఈ రిజర్వేషన్లు 2011 జనాభా ఆధారంగా, బీసీ డెడికేషన్ కమిషన్ నివేదికను అనుసరిస్తూ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనలు , మార్గదర్శకాలకు అనుగుణంగా ఖరారు చేయబడ్డాయని తెలిపారు. లాటరీ ద్వారా ఖరారైన రిజర్వేషన్ల పూర్తి వివరాలను ప్రభుత్వం రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కి నివేదించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సంబంధిత మున్సిపల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది , గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మహిళల్లో దాగిన కళలకు వేదికగా ముగ్గుల పోటీలు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సంక్రాంతి పండుగ సందర్భంగా కిన్నెరసాని గ్రామ పంచాయతీలో సర్పంచ్ వజ్జా రామకృష్ణ, ఉపసర్పంచ్ వజ్జా ఇంద్రజా ఆధ్వర్యంలో క్రీడ మైదానంలో ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో యువతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగు రంగుల ముగ్గులతో ఆకట్టుకున్నారు. మహిళల్లోని కళాత్మక ప్రతిభను వెలుగులోకి తీసుకురావడంతో పాటు పండుగ ఉత్సాహాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.పోటీల్లో మొదటి బహుమతి - తాటి రామ, రెండవ బహుమతి - బోనగిరి శ్రీలత, మూడవ బహుమతి - బుడగం హేమలతలు గెలుచుకున్నారు. బహుమతులను వజ్జ శ్యామ్ దంపతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు కట్ట సోమయ్య, రోజా, వజ్జ విజయ్, తాటి సురేష్, కల్తీ ప్రవీణ్ కుమార్, కోర్సా వినిత, తాటి సాంబలక్ష్మి, శెట్టిపల్లి కళ్యాణి, గుమ్మడి లక్ష్మి, వజ్జ బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య జీవితానికి క్రీడలు ఎంతో అవసరం...

*** యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వినయ్ గౌడ్**



అందోలు, ప్రజాస్ఫూర్తి : ఆరోగ్య జీవితానికి క్రీడలు ఎంతో అవసరమని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వినయ్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ యువ నాయకురాలు అరగొండ మహానంద అరవింద్ ఆద్వర్యంలో సీడిఆర్ వాలీబాల్, కబడ్డీ పోటీల బహుమతుల ప్రధానోత్సవంలో పాల్గొని విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. వాలీబాల్ పోటీలో శివాజీ యూత్ టీం మొదటి బహుమతి, భరత్ టీం రెండవ బహుమతి, కబడ్డీ పోటీలో నరేష్ టీం ప్రథమ బహుమతి, లోకేష్ టీం ద్వితీయ బహుమతి సాధించాయి. అంతకు ముందు కబడ్డీ ఫైనల్ పోరు సందర్భంగా వినయ్ గౌడ్ టాస్ వేసి అనంతరం కాసేపు కబడ్డీ ఆడి క్రీడాకారులల్లో నూతన ఉత్తేజాన్ని నింపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో పాటు క్రీడల ద్వారా యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, దీంతోపాటు మానసిక ఉల్లాసానికి, శారీరక ధారుఢ్యానికి క్రీడలు దోహదపడుతాయన్నారు. క్రీడా పోటీలలో ప్రతి ఒక్కరూ గెలుపు, ఓటములను పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపేవారికి సమాజంలో గుర్తింపు లభిస్తుందని గ్రామీణ క్రీడల్లో రాణించే వారు జాతీయ స్థాయి ఎదుగుదలకు ఉపయోగపడుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ క్రీడలకు ప్రాధాన్యతను కల్పిస్తూ , గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్ పోటీలను నిర్వహిస్తోందన్నారు. జీవితంలో స్థిరపడాలన్నా, ఉద్యోగాలు సంపాదించాలన్నా భవిష్యత్‌లో స్పోర్ట్స్ కోటా ఉంటుందని తెలపారు. క్రీడల్లో రాణించే క్రీడాకారులకు తన వంతు సహకారం తప్పనిసరిగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజిలీపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగప్ప, సర్పంచ్ నాగమణి నర్సింలు, కేరుర్ గ్రామ సర్పంచ్ కార్తీక్ గౌడ్, యువజన కాంగ్రెస్ నాయకులు అరవింద్,వార్డు మెంబర్లు, మల్లేశం,కాశినాథ్,కుమార్, శివశంకర్, మాజీ ఎంపిటిసి సదానందం తో పాటు తదితరులు పాల్గొన్నారు.




## విద్య, క్రీడలతోనే అంతర్జాతీయ గుర్తింపు...

యువజన కాంగ్రెస్ మండల అద్యక్షుడు ప్రవీణ్‌ముదిరాజ్

అందోలు, ప్రజాస్ఫూర్తి : అంతర్జాతీయ గుర్తింపు విద్య, క్రీడలతోనే సాధ్యమని యువజన కాంగ్రెస్ మండల అద్యక్షుడు ప్రవీణ్ ముదిరాజ్, ఏయంసీ మాజీ డైరెక్టర్ శేరి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం కన్‌సాన్‌పల్లి ప్రీమియర్ లీగ్ సీజన్-3 పోటీలలో భాగంగా చివరి రోజు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. మొదటగా దేవునూరి శ్రీశైలం జట్టు, జోగాల శివకుమార్ జట్లు మద్య సాగిన హోరాహోరీగా పోరులో శివకుమార్ జట్టు విజయం సాధించింది. చివరి ఫైనల్ పోటీలో శివకుమార్ జట్టు, తలారీ దత్తు టీం జట్ల మద్య పోరు సరవత్తరంగా సాగడంతో అందరినీ ఆకర్షించింది. చివరగా తలారీ దత్తు టీం విజయం సాధించింది.ద్వితీయ స్థానంలో శివకుమార్ జట్టు నిలిచింది. అంతకు ముందు క్రికెట్ ఫైనల్ పోటీల్లో సంగాన్నగారి శ్రీకాంత్ (కన్‌సాన్‌పల్లి టైటాన్స్)జట్టు, తలారి బాలక్రిష్ణ (కన్‌సాన్‌పల్లి చాలెంజర్స్) జట్ల మద్య సాగిన పోరులో టైటాన్స్ జట్టు అద్భుతమైన పోలింగ్ ప్రదర్శించడంతో చాలెంజర్స్ జట్టు తక్కువ స్కోరుకే పరిమితం కావడం అటు తర్వాత టైటాన్స్ జట్టు సునాయస విజయాన్ని అందుకొని విజేతగా నిలిచింది. కేపిఎల్ సీజన్-3లో మొదటిసారిగా ప్రవేశపెట్టి జూనియర్స్ కబడ్డి పోటీలు అందరిని అలరించారు. మొదటి సారి జరుగుతున్న కబడ్డీ పోటీలను వీక్షించేందుకు గ్రామం నుండి పెద్ద ఎత్తున ప్రేక్షకులు తరలిరావడం రావడంతో ఒక్కసారిగా అక్కడి వాతావరణం క్రీడా సంబరంగా మారింది. మ్యాచ్‌లు జరుగుతున్న సమయంలో ప్రేక్షకుల నుండి మద్దతు పెరిగిపోవడంతో క్రీడాకారులు ఎంతో ఉత్సాహాన్ని ప్రదర్శిస్తూ క్రీడలు ఆడారు. చివరి పోటీలో పల్టాన్స్ మహేష్ టీం, నరహరి టైటాన్స్ టీం లు తలపడగా మహేష్ టీం పైచేయి సాధించి విజేతగా నిలిచింది.

**- విజేతలకు బహుమతల ప్రధానం...**

ఈ సీజన్‌లో జరిగిన పోటీలకు సంబందించి కీ.శే బుసనెల్లి సాయికుమార్ జ్ఞాపకార్థంగా ఆయన సోదరుడు బుసనెల్లి అంజనేయులు బహుమతులను ప్రధానం చేశారు. గెలుపొందిన క్రీడాకారులకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేదికను ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రామానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ సునీత మహిపాల్,యువజన కాంగ్రెస్ మండల అద్యక్షుడు ప్రవీణ్ ముదిరాజ్ హాజరై క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెంటయ్య, మాజీ ఎంపిటీసీ బాలయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సురేష్‌రావు, వార్డు సభ్యులు మహిపాల్, వని మోహన్, తలారి బాలక్రిష్ణ, కలపల్లి లక్ష్మీప్రభు, రామాదేవి దుర్గేష్, యువ నాయకులు దేవునూరి శ్రీశైలం, జోగాల గోవర్ధన్, పంతులు ఈశ్వర్, రఘు, వహీద్, షర్ఫోద్దీన్, కాడెం శ్రీనివాస్,బాల్‌రాజ్, మణికంఠ, ముదిరాజ్ సంఘ అద్యక్షుడు ఈశ్వర్, మాజీ వార్డు సభ్యులు దత్తు, నాయకులు దుర్గయ్య, యాదయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

**- కేపిఎల్ క్రీడలు విజయవంతం...**

కేపిఎల్ సీజన్-3 క్రీడలలో భాగంగా కబడ్డీ,వాలిబాల్, క్రికెట్ అను మూడు విభాగాలలో క్రీడలు నిర్వహించారు. మూడు రోజుల పాటు క్రీడలు సాగగా అందుకు మైదానాల ఏర్పాటు నుండి క్రీడాకారులకు సౌకర్యాల కల్పన వరకు ఎటువంటి ఇబ్బంతులు తలెత్తకుండా నిర్వహకులు బాలక్రిష్ణ, రాపర్తి ప్రభు, జోగాల ప్రవీణ్, క్రిష్ణలు చర్యలు తీసుకున్నారు. ఆటల్లో పాల్గొన్న 150 మంది క్రీడాకారులకు యువజన కాంగ్రెస్ అద్యక్షుడు జర్సీలు ఉచితంగా అందజేయగా, క్రీడాకారులకు అన్నధాన కార్యక్రమాన్ని పోలీసు దత్తు, యువ నాయకుడు పంతులు ఈశ్వర్ కూల్‌డ్రింక్స్‌తో పాటు క్రికెట్ బ్యాట్లు ,పి.భాగేష్ త్రాగునీటిని సరఫరా చేయగా,దేవునూరి ప్రభు ఆటగాళ్ల అందరికీ ఆరటి పళ్లను, వాలీబాల్ ఆట వస్తువులు వహీద్, అలసిపోయిన సందర్భంలో తక్షణ శక్తని ఇచ్చేందుకు గ్లూకోండిని గొల్ల కళ్యాణ్ , తాళ్ల మణికంఠ డిజే సౌండ్, టెంట్‌హౌజ్ ఏర్పాటుచేశారు. ఇలా ఒక్కొక్కరు ఒక్కొక్క ప్రధానమైన ఏర్పాట్లు చేయడంలో చేయూతను అందించి క్రీడలను విజయవంతం చేయడంలో కృషి చేయడం పట్ల వారిని అందరూ అభినందించారు.

## ప్రజలంతా రహదారి భద్రతా నియమాలను పాటించాలి




కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : ప్రజలంతా రహదారి భద్రతా నియమాలను పాటించి, తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడుకోవాలని కూకట్పల్లి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీను బాబు , కేపీహెచ్బీ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ లు అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా శనివారం కూకట్ పల్లిలో నిర్వహించారు. కూకట్పల్లి పరిధిలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్ స్పాట్లను అధికారులు సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీను బాబు, కేపీహెచ్బీ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, ట్రాఫిక్ ఎస్ఐ పాల్గొని, ప్రమాదాలకు దారి తీస్తున్న రోడ్డు పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనదారులు, పాదచారులకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. పాదచారులు తప్పనిసరిగా జీబ్రా క్రాసింగ్ వద్దనే రోడ్డు దాటాలని, అలాగే వాహనదారులు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను కచ్చితంగా పాటిస్తూ వాహనాలు నడపాలని అధికారులు సూచించారు.పాదచారులు రోడ్డు దాటేటప్పుడు సెంట్రల్ మీడియన్ దాటి అజాగ్రత్తగా రోడ్డు దాటడం వంటి చర్యల వల్ల తీవ్ర ప్రమాదాలు సంభవిస్తున్నాయని అధికారులు హెచ్చరించారు. ఇటువంటి నిర్లక్ష్యమే అనేక రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమవుతోందని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రోడ్డు ప్రమాదాలకు గురైన బాధితులు కూడా పాల్గొని, తమ అనుభవాలను పంచుకున్నారు. అలాగే రోడ్డు ప్రయాణికులు తమ అభిప్రాయాలు, సూచనలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

## కొమరంభీం ఆదివాసీల దైవం : కొత్వాల



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఆదివాసీల సంక్షేమం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు కొమరంభీం ఆదివాసీల దైవం అని రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ మండలం కిన్నెరసాని పంచాయతీ రాజపురంలో వజ్జా విద్యాసాగర్ జ్ఞాపకార్థం కొమరంభీం పేరుతో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి, ఆళ్ళపల్లి, ములకలపల్లి మండలాల స్థాయిలో జరిగిన పోటీల్లో సాటివారిగూడెం జట్టు మొదటి బహుమతి (రూ.15,116/), కిన్నెరసాని జట్టు రెండో బహుమతి (రూ.10,116/) గెలుచుకున్నాయి. విన్నర్, రన్నర్ కప్పులను కొత్వాల బహుకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు కూడా బహుమతులు అందజేశారు. గ్రామీణ క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

## తోగ్గూడెంలో ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: తోగ్గూడెం రామాలయ ప్రాంగణంలో పాల్వంచ ధనలక్ష్మి జ్యుయలరీ షాప్ లంక రాము, సర్పంచ్ సుధ, ఉప సర్పంచ్ రాంబాబు, గ్రామ పెద్దల కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ పోటీలలో చిన్నా, పెద్దా అన్న తేడా లేకుండా మహిళలు, యువతులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని మన పండుగలు, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా అందమైన రంగవల్లులు వేసి అందరి మన్ననలు పొందారు. ఈ సందర్భంగా సంప్రదాయ కళలకు ప్రోత్సాహం కల్పించడమే లక్ష్యంగా సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ పెద్దలతో సమన్వయంతో ఈ పోటీలు నిర్వహించామని నిర్వాహకులు ధనలక్ష్మి జ్యుయలరీ షాప్ యజమాని (గోల్డ్ షాప్) లంక రాము తెలిపారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రథమ బహుమతిగా వెండి కుంకుమ భరిణ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా వెండి షీల్డ్ లను అందజేశారు. అంతేకాక కన్సలేషన్ బహుమతులుగా 9 మందికి నాన్ స్టిక్ తవ్వాలను అందించడంతో పాటు, పోటీలో పాల్గొన్న ప్రతి మహిళకు స్పెషల్ గిఫ్ట్ అందజేయడం విశేషం. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ పాల్వంచ పట్టణ మహిళ అధ్యక్షురాలు బట్టు మంజుల జడ్జిగా హాజరై ముగ్గుల పోటీలను పర్యవేక్షించి విజేతలను ప్రకటించారు. ఈ సందర్భంగా భోగి మంటలు ఏర్పాటు చేసి పిల్లా పెద్ద ఊరంతా సంప్రదాయం చేశారు. బహుమతులను ప్రధానం చేసే సమయంలో ఏర్పాటు చేసిన డాన్స్ షో మొత్తం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు నిర్వాహకులు గోల్డ్ షాప్ లంక రాము, జడ్జి బట్టు మంజుల లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. బహుమతులు అందించిన పాల్వంచ ధనలక్ష్మి జ్యుయలరీ షాప్ యాజమాన్యానికి గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్క గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# బుర్గంపాడు సీహెచ్‌సీలో చరిత్రాత్మక ఘట్టం



*** మొట్టమొదటి సిజేరియన్ విజయవంతం**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: (బుర్గంపాడు) బుర్గంపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) చరిత్రలో తొలిసారిగా వైద్యులు సిజేరియన్ (పెద్దాపరేషన్) విజయవంతంగా నిర్వహించి చరిత్ర సృష్టించారు. ఈ ఘనతతో ఇప్పటివరకు ప్రసూతి సేవల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానిక ప్రజలకు పెద్ద ఊరట లభించింది. సారపాకకు చెందిన బానోత్ మమత (26) అనే మహిళ రెండో కాన్పు కోసం బుర్గంపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. పరీక్షించిన ప్రసూతి వైద్యురాలు డా. అనూష లక్ష్మి సిజేరియన్ ఆపరేషన్ చేయగా, 3 కేజీల బరువైన పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. తల్లి, బిడ్డ ఇద్దరూ పూర్తిగా క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.

*** పెరిగిన సదుపాయాలే కారణం**

గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా ఉన్న బుర్గంపాడు ఆసుపత్రిని 2022లో వైద్య విధాన పరిషత్ పరిధిలోకి తీసుకొని 30 పడకల ఆసుపత్రిగా మార్చారు. అయితే, అవసరమైన భవనాలు, మౌలిక వసతులు అప్పట్లో పూర్తిగా అందుబాటులో లేవు. స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచనలతో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ప్రత్యేక చొరవ తీసుకుని ఆసుపత్రికి కావలసిన మౌలిక సదుపాయాలు, ఆపరేషన్ థియేటర్‌కు అవసరమైన పరికరాలు సమకూర్చారు.జిల్లా ఆసుపత్రుల ప్రధాన సమన్వయ అధికారి (డీసీహెచ్‌ఎస్) డా. రవి బాబు ఆదేశాల మేరకు గతంలో ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యులు, ఇటీవల ఒక ప్రసూతి వైద్యురాలిని నియమించారు. 24 గంటల వైద్య సేవలు, రక్త పరీక్షల యంత్రాలు, డెంటల్ పరికరాలు ఏర్పాటు చేయడంతో రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

**నూతన భవన నిర్మాణం వేగంగా**

సుమారు రూ.2 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులతో నూతన ఆసుపత్రి భవనాన్ని ఆరు నెలల క్రితం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆసుపత్రిలో తొలి సిజేరియన్ జరగడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**సేవలు మరింత మెరుగవుతాయి**

*** ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. ముక్కంటేశ్వరావు**

గత ఏడాది నుంచి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహిస్తున్నామని, ఇప్పుడు సిజేరియన్ సౌకర్యం అందుబాటులోకి రావడంతో పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు చేరువయ్యాయని తెలిపారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ ప్రత్యేక దృష్టితో, డీసీహెచ్‌ఎస్ డా. రవి బాబు నిరంతర పర్యవేక్షణలో ఆసుపత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

*** త్వరలో డయాలిసిస్ కేంద్రం– డీసీహెచ్‌ఎస్ డా. రవి బాబు**

రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇటీవల జిల్లాలోని వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల పనితీరును సమీక్షించి అభినందించారని తెలిపారు. ఈ సిజేరియన్‌తో జిల్లాలోని ఏడు వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులన్నింటిలో ఆపరేషన్ థియేటర్, ప్రసూతి సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. త్వరలో బుర్గంపాడులో డయాలిసిస్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

*** వైద్య బృందానికి అభినందనలు**

వైద్య బృందాన్ని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఎంపి బలరాం నాయక్, టీవీవీపీ రాష్ట్ర కమిషనర్ డా. అజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్, డీసీహెచ్‌ఎస్ డా. రవి బాబు అభినందించారు.ఈ ఆపరేషన్‌లో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. ముక్కంటేశ్వరావు, ప్రసూతి వైద్యురాలు డా. అనూష లక్ష్మి, మత్తు వైద్యుడు డా. రామ్ ప్రసాద్, నర్సింగ్ ఆఫీసర్లు రేవతి, కరుణశ్రీ, పద్మ, జ్యోతి, నర్సింహ, కవిత తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ విద్యాభివృద్ధికి సి ఎస్ ఆర్ సంస్థలు ముందుకు రావాలి

**– జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో విద్యా మౌలిక సదుపాయాల అభివృద్ధికి కార్పొరేట్ సామాజిక బాధ్యత (సి ఎస్ ఆర్) సంస్థల సహకారం అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సి ఎస్ ఆర్ బృంద సభ్యులు జిల్లాలోని పలు పాఠశాలలు, భవిత కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాల్వంచ మండలంలోని భవిత కేంద్రం, కోయ గట్టు పాఠశాలలను పరిశీలించారు. కోయ గట్టు పాఠశాల వద్ద కౌజు పిట్టల పెంపకం ద్వారా సాధారణ వ్యక్తికి వచ్చే ఆదాయం, ఉపాధి అవకాశాలపై కలెక్టర్ సి ఎస్ ఆర్ బృంద సభ్యులకు వివరించారు.అనంతరం బూర్గంపాడు మండలంలోని చెరువు సింగారం ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి సి ఎస్ ఆర్ నిధుల ద్వారా సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల మౌలిక సదుపాయాల అభివృద్ధికి సి ఎస్ ఆర్ సంస్థలు భాగస్వాములు కావాలని ఆయన సూచించారు.ఈ పర్యటనలో సి ఎస్ ఆర్ బృంద సభ్యులు కోటా లక్ష్మీనరసింహ, రఘు, సుమంత్, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు ఎస్‌కే. సైదులు, ఎన్. సతీష్ కుమార్, పాల్వంచ మండల విద్యాధికారి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్ : సహజవనరులను వినియోగించడం ద్వారా వరద ప్రమాదాలను నివారించడంతోపాటు ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు సమృద్ధిగా సాగు నీరు అందించేందుకు ప్రభుత్వం మున్నేరుపాలేరు లింక్ పథకం నిర్మాణం చేపట్టిందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు రాష్ట్రప్రభుత్వం రూ.162.57 కోట్లు కేటాయించిందని తెలిపారు. మున్నేరుపాలేరు లింక్ కాలువ పొడవు 9.6 కిలోమీటర్లు కాగా.. సెకనుకు 4,500 క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని తట్టుకునేలా రూపొందించినట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తయితే ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలో 1.38 లక్షల ఎకరాలకు స్థిరీకరణతోపాటు పాలేరు రిజర్వాయర్ ఎగువ భాగంలోని 40 ఎకరాల ఎన్ఎస్‌పీ ఆయకట్టుకు నీటి భద్రత లభిస్తుందని వెల్లడించారు.

# నల్గొండ పట్టణాన్ని సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతా..

*** రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమటోగ్రాఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

*** నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లో రూ.18.7 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థపన..**






ప్రజా స్ఫూర్తి, నల్లగొండ : నల్గొండ మున్సిపాలిటీ నగరపాలక సంస్థగా మారినందున నల్గొండను సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. శనివారం ఆయన నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో సుమారు 18.7 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో మంత్రి మాట్లాడుతూ నల్గొండ పట్టణాభివృద్ధికి ఇప్పటివరకే సుమారు రెండువేల కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. అమృత్2 కింద 216 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, నూతన ఎస్ టి పి నిర్మాణ పనులు జరుగుతున్నాయని ,అలాగే 56 కోట్ల 75 లక్షలతో మంచినీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరిచేందుకు కొత్తగా 12 ట్యాంకులు , తాగునీటి పైప్లైన్ల పనులు నిర్మాణంలో ఉన్నాయని చెప్పారు. 53 కోట్ల టి యు ఎఫ్ ఐ డి సి నిధులతో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని, 109 కోట్ల రూపాయలతో ఎస్ డిఎఫ్ నిధులతో వరద కాలువల నిర్మాణం, స్మశాన వాటికల అభివృద్ధి పనులు, అంతర్గత రహదారుల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. మరో 14 కోట్ల టి యు ఎఫ్ ఐ డి సి నిధులతో బస్టాండ్ నుండి మేకల అభినవ్ అవుట్డోర్ స్టేడియం వరకు బిటి రోడ్డు పనులు జరుగుతున్నాయని, 18 కోట్ల టీయూఎఫ్ ఐ డి సి నిధులతో డిఈఓ ఆఫీస్ నుంచి మిర్యాలగూడ రోడ్డు వరకు, 545 కోట్లతో బైపాస్, 565 పాన్గల్ చాయ సోమేశ్వర దేవాలయం నుండి ఎస్ ఎల్ బి సి కాలనీ వరకు రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నట్లు తెలిపారు. 260 కోట్ల ఆర్ అండ్ బి నిధులతో ఎస్ఎల్బీసీ మెడికల్ కాలేజ్ నుండి అద్దంకి రోడ్డు వరకు రోడ్డు నిర్మాణం చేపట్టామని, అలాగే పట్టణంలో ఐదు సబ్ స్టేషన్లు మంజూరు చేయించడం జరిగిందని, ఇటీవల నాలుగు సబ్ స్టేషన్ ల శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు. నల్గొండ నుండి మునుగోడు రోడ్డు, ధర్వేశిపురం రోడ్డు,ముశ్రం పల్లి రోడ్డు డబుల్ రోడ్ 100 కోట్ల రూపాయలతో పనులు 70 శాతం పూర్తి చేయడం జరిగిందని, నల్గొండ నుండి గుండపల్లి, కురంపల్లి వరకు 60 కోట్ల రూపాయల రోడ్డు పనులు 70% పూర్తయిందని చెప్పారు. 25 కోట్ల నాక్ బిల్డింగ్ 90% పూర్తి చేయడం జరిగిందని, 40 కోట్లతో నర్సింగ్ కాలేజీ శంకుస్థాపన చేశామని, సంవత్సర కాలంలోనే క్రిటికల్ కేర్ సెంటర్ ప్రారంభించామని, 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులు ఎస్ ఎల్ బి సి వద్ద పురోగతిలో ఉన్నాయని పేర్కొన్నారు. 250 కోట్ల రూపాయలతో మహాత్మా గాంధీ యూనివర్సిటీలో కొత్త బిల్డింగ్ లతోపాటు, కొత్త కోర్సులు బి ఫార్మసీ ,ఎల్ఎల్బి తీసుకువచ్చామని, యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు సెట్విన్ స్థాపించామని వెల్లడించారు. 24 గంటలు నల్గొండ కార్పొరేషన్ లో ప్రతిరోజు కృష్ణానీటిని సరఫరా చేసేందుకు 125 కోట్ల రూపాయల డి పి ఆర్ తో ప్రభుత్వ మంజూరుకు పంపించామని, అలాగే 140 కోట్ల రూపాయలతో లతీఫ్ సబ్ దర్గా, బ్రహ్మంగారి గుట్టకు ఘాట్ రోడ్ మంజూరు చేసి పనులు కొనసాగుతున్నాయని, మార్చి లోపు ఈ. పనులు పూర్తవుతాయని తెలిపారు. నాలుగు కోట్ల ఎన్సిఏపీ నిధులతో పట్టణంలో పార్కుల అభివృద్ధి, మీడియ న్ ల అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, కోటి 43 లక్షలతో మాన్యం చెల్క అర్బన్ ప్రైమరీ సెంటర్ కు నూతన భవనం నిర్మిస్తున్నామని, పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన ఆహారం అందించేందుకు కోటి రూపాయలతో ఎన్ హెచ్ ఎం నిధులతో ఫుడ్ స్ట్రీట్ అభివృద్ధి చేయడం జరిగిందని, మున్సిపాలిటీలోని సాధారణ నిధుల ద్వారా 55 కోట్లతో వివిధ పనులు చేసామని, 15వ ఆర్థిక సంఘం కింద రెండు కోట్ల 24 లక్షలతో మున్సిపాలిటీకి అవసరమైన జెసిబిలు, ట్రాక్టర్లు కొనుగోలు చేశామని, కోటి 30 లక్షల సబ్ ప్లాన్ ద్వారా పట్టణంలో 16 వార్డులలో పనులు మొదలుపెట్టామని వెల్లడించారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ఐదు కోట్ల రూపాయలతో లాప్రోస్కోపిక్, చిన్నపిల్లల వర్మర్ కోసం వసతులు కల్పించామని, ప్రతీక్ ఫౌండేషన్ సహకారంతో 10 కోట్ల రూపాయలతో బొట్టు గూడా ప్రైమరీ పాఠశాలను, హైస్కూల్ ను, ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ లో డిజిటల్ క్లాస్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నల్గొండ మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్ అయినందున కేంద్రం ద్వారా నేరుగా నిధులు వచ్చేందుకు అవకాశం ఉందని, అందువల్ల పట్టణ ప్రజలు సామరస్యంతో పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. నల్గొండ పట్టణాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేలన్నదే తన ధ్యేయమని, హైదరాబాద్ కు సమాంతరంగా నల్గొండను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని, ఎస్ ఎల్ బి సి టన్నెల్ ను పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు. రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లోని 48 డివిజన్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరార.ఈ సందర్భంగా మంత్రి పట్టణంలోని వీటి కాలనీ, చింతల్ పార్క్, దేవరకొండ రోడ్డు, సావర్కర్ నగర్, పాలిటెక్నిక్, తదితర ప్రాంతాలలో 18 కోట్ల 70 లక్షలతో చేపట్టనున్న పార్కులు, రహదారులు, బిటి రోడ్లు, స్ట్రామ్ వాటర్ డ్రైన్లు, తాగునీటి సరఫరా తదితర పనులకు శంకుస్థాపనలు చేశారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ మొదటిసారిగా కార్పొరేషన్ అయిన నల్గొండ పట్టణాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్, ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, ప్రజారోగ్య సంస్థ సూపరింటిండెంట్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు హఫీజ్ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్లు బుర్రి శ్రీనివాస్ రెడ్డి, బొడ్డుపల్లి లక్ష్మీ శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి గుమ్ముల మోహన్ రెడ్డి , మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, తహసిల్దార్ పరుశురాం, డిసిసిబి మాజీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, ఇతర అధికారులు ,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# మీరూ ఇలాంటి అమ్మాయేనా?



**కొంతమంది అమ్మాయిలు తమలో ఆత్మవిశ్వాసం లోపించిందని.. ఫలితంగా తామేమీ సాధించలేకపోతున్నామని.. ఏ పని చేయాలన్నా ఇతరులపై ఆధారపడాల్సి వస్తోందని బాధపడుతుంటారు. అలాంటి వారు ఆత్మవిశ్వాసం మెండుగా ఉండే వారిలో ఎలాంటి లక్షణాలుంటాయో తెలుసుకోగలిగితే.. వారి నుంచి స్ఫూర్తి పొందచ్చని చెబుతున్నారు నిపుణులు.**

**సొంతంగా నిర్ణయాలు..**

అమ్మాయిలు ఏం చదవాలి.. ఎక్కడ చదవాలి.. ఎలాంటి ఉద్యోగం చేయాలి.. మొదలైన అంశాల్లో కొన్ని కుటుంబాల్లో ఇప్పటికీ తుది నిర్ణయం పెద్దలదే అవుతుంటుంది. వారిది చిన్న వయసు కావడం వల్ల వారికేమీ తెలీదనే భావన కూడా ఇందుకు ఓ కారణం కావచ్చు. అయితే ఆత్మవిశ్వాసం ఉన్న అమ్మాయిల్లో తాము ఏం చేయాలో వారే నిర్ణయం తీసుకొనే సామర్థ్యం ఉంటుందట. అలాగని ఇతరుల అభిప్రాయాలకు విలువ ఇవ్వరని కాదు. ఎదుటివారి భావాలను గౌరవిస్తూనే.. తమ వాణిని బలంగా వినిపించే ప్రయత్నం చేస్తుంటారు. అలాగే తాము తీసుకొన్న నిర్ణయం సరైనదేనా? కాదా? అని ఆలోచించుకోవడంతో పాటు.. దానివల్ల జరిగే మంచిచెడులను కచ్చితంగా బేరీజు వేసుకోగలుగుతారు. ఫలితంగా తమ లక్ష్యం వైపు ప్రోత్సహించేలా కుటుంబ సభ్యులు, స్నేహితులనూ వీరు ఒప్పించగలుగుతారని నిపుణులు చెబుతున్నారు.

**'నో' చెప్పడం తెలుసు..!**

ఎవరైనా మనకు ఏదైనా పని అప్పగించినప్పుడు కొన్ని సందర్భాల్లో ఇష్టం లేకపోయినా.. మొహమాటానికి పోయి ఆ పనిని పూర్తి చేయాల్సి వస్తుంది. అలాంటి సందర్భాల్లో మేం ఈ పని చేయలేమని ధైర్యంగా చెప్పలేకపోతాం. కానీ ఆత్మవిశ్వాసం మెండుగా ఉండే ఈ తరం అమ్మాయిలు తమకు నచ్చని పనులు 'చెయ్యం' అని చెప్పడానికి ఏమాత్రం వెనుకాడరట! అలాగే ఆ పనిని తాము ఎందుకు చేయమంటున్నారో దానికి గల కారణాలను సైతం వారు చెప్పడానికి మొహమాటపడరట!

**అసూయ ఉండదు..**

ఇతరులు తమకంటే కొన్ని విషయాల్లో మెరుగ్గా ఉన్నా లేదా వారు చేస్తున్న పనిలో విజయం సాధించినా వారిని చూసి అసూయపడే వారు చాలామందే ఉంటారు. కానీ ఆత్మవిశ్వాసం ఉన్న వారు ఇతరులను చూసి ఇలా అసూయపడరట. తమ పనేదో తాము చూసుకొని ముందుకు సాగుతుంటారే తప్ప.. ఇతరుల గురించి ప్రతిదీ పట్టించుకోవాలన్న ఆసక్తి వారికుండదు. ఫలితంగా తాము చేస్తున్న పని పైనే పూర్తి శ్రద్ధ పెట్టి, సాధించాలనుకొన్న లక్ష్యాల్ని చేరుకోగలుగుతారు. అంతేకాదు.. అవసరంలో ఉన్న వారికి సహాయం చేయడానికీ వీరు వెనకాడరట. అలాగే ఇతరులను ప్రోత్సహించడంలోనూ వీరు ముందుంటారు అంటున్నారు నిపుణులు. మరి మీరూ అంతేనా?

# రూ.5వేలతో ఆశపెట్టి.. ఐటీ ఉద్యోగి నుంచి రూ.2.9 కోట్లు స్వాహా

హైదరాబాద్: స్టాక్ మార్కెట్లో పెట్టుబడులకు 300 శాతం లాభం వస్తుందని ఆశపెట్టిన సైబర్ నేరగాళ్లు.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నుంచి రూ.2.9 కోట్లు కొట్టేశారు. హైదరాబాద్ శేరిలింగంపల్లికి చెందిన ఐటీ నిపుణుడి(45)కి గతేడాది నవంబరు 12న వాట్సాప్‌లో ఒక వెబ్‌లింకు వచ్చింది. స్టాక్ మార్కెట్లో పెట్టుబడులకు సలహాలిస్తామని లింకులో ఉంది. క్లిక్ చేసి వాట్సాప్ గ్రూపులో చేరాడు. అనిల్ గోయల్ అనే వ్యక్తి ఇతడిని పరిచయం చేసుకున్నాడు. షేర్ల గురించి సలహాలు తీసుకుని ఎంతో మంది డబ్బు సంపాదించారంటూ స్క్రీన్‌షాట్లు పోస్టు చేసేవాడు. గ్రూపులోని ప్రతి ఒక్కరూ కచ్చితంగా 300 శాతం లాభాలు పొందొచ్చని నమ్మించాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నిజమేనని భావించి చెప్పినట్లుగా యాప్ డౌన్‌లోడ్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. డిసెంబరు 15న తొలిసారి రూ.50 వేలు పెట్టుబడి పెట్టగా.. రూ.5 వేలు లాభం వచ్చింది. తర్వాత పలుమార్లు మొత్తం రూ.2.9 కోట్లు బదిలీ చేశాడు. పెట్టుబడి,




లాభం కలిపి రూ.3.47 కోట్లకు చేరినట్లు యాప్‌లో వర్చువల్‌గా కనిపించేది. అప్పటికే రుణభారం పెరగడంతో షేర్లలో కొన్నింటిని విక్రయించి అప్పు తీర్చాలనుకున్నాడు. ఈ విషయమై వాట్సాప్ గ్రూపులో సలహాలిచ్చిన అనిల్‌ను ఫోన్‌లో సంప్రదించగా.. విక్రయించడం సాధ్యంకాదని చెప్పాడు. అదనంగా డబ్బు చెల్లించాలని సూచించడంతో .. నకిలీ యాప్‌లో తనతో పెట్టుబడులు పెట్టించి డబ్బు కొట్టేశారని గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు.

## తెలంగాణలో 20 మంది
# ఐపీఎస్ అధికారుల బదిలీ

హైదరాబాద్: తెలంగాణలో 20 మంది ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. గజారావు భూపాల్ (ఐజీ), అభిషేక్ మొహంతి (విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఐజీ), భాస్కరన్ (ఇంటెలిజెన్స్



డీఐజీ), చందనా దీప్తి (ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ అదనపు సీపీ), టి. అన్నపూర్ణ (అడ్మిన్, సైబరాబాద్ డీసీపీ), రాహుల్ హెగ్డే (హైదరాబాద్ సిటీ ట్రాఫిక్3 డీసీపీ), అపూర్వారావు (ఇంటెలిజెన్స్ ఎస్పీ), బి.బాలస్వామి (విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ), వెంకటేశ్వర్లు (సీఐడీ ఎస్పీ)అవినాష్ కుమార్ (క్రైమ్స్, డీసీపీ)గా బదిలీ అయ్యారు.

# BRS ర్యాలీ.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వద్ద ఉద్రిక్తత

హైదరాబాద్: సికింద్రాబాద్ కార్పొరేషన్ కోసం బీఆర్ఎస్ పోరు బాట పట్టింది. సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ.. మాజీ మంత్రి తలసాని ఆధ్వర్యంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ఎంజీ రోడ్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు భారీ శాంతి ర్యాలీకి పిలుపునిచ్చారు. అయితే.. ఈ ర్యాలీకి అనుమతి లేదని పోలీసులు తెలిపారు. సికింద్రాబాద్ జిల్లా సాధన సమితి పేరుతో ర్యాలీకి అనుమతి అడిగారని.. అయితే నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. ఈ కారణంతో ర్యాలీకి అనుమతి ఇవ్వలేదని చెప్పారు. ర్యాలీలో పాల్గొనేందుకు వస్తున్న వారిని అదుపులోకి



తీసుకున్నారు. దీంతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. భారీ సంఖ్యలో పోలీసులు, ప్రత్యేక బృందాలను మోహరించారు.

## కార్పొరేషన్ మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్‌ల
# రిజర్వేషన్లు ఖరారు

హైదరాబాద్: తెలంగాణలో కార్పొరేషన్ మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్‌ల రిజర్వేషన్లు ఖరారయ్యాయి. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కేటాయించినట్లు మున్సిపల్ శాఖ డైరెక్టర్ శ్రీదేవి తెలిపారు. ఈ మేరకు మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. 121 మున్సిపాలిటీల్లో 5 ఎస్టీ, 17 ఎస్సీ, 38 బీసీలకు కేటాయించారు.

* కొత్తగూడెం కార్పొరేషన్ ఎస్టీ జనరల్
* రామగుండం కార్పొరేషన్ ఎస్సీ జనరల్
* మహబూబ్‌నగర్ కార్పొరేషన్ బీసీ మహిళ
* మంచిర్యాల కార్పొరేషన్ బీసీ జనరల్
* కరీంనగర్ కార్పొరేషన్ బీసీ జనరల్
* జీహెచ్ఎంసీమహిళా జనరల్




* గ్రేటర్ వరంగల్‌జనరల్
* ఖమ్మం కార్పొరేషన్‌మహిళా జనరల్
* నల్గొండ కార్పొరేషన్‌మహిళా జనరల్
* నిజామాబాద్ కార్పొరేషన్ మహిళా జనరల్

# చెరువుల్లో మట్టిపోయడంపై హైడ్రా ఆగ్రహం

చెరువుల ఫుల్ ట్యాంక్ లెవెల్(ఎఫ్టీఎల్), బఫర్ పరిధిల్లో మట్టి పోయడాన్ని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు సీరియస్‌గా పరిగణించారు. చెరువుల స్వరూపాన్ని మార్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మట్టి పోసి నింపడానికి అవకాశం లేకుండా ఫెన్సింగ్ వేయాలని నిర్ణయించారు. అలాగే మట్టి ఎవరు పోసారో వాళ్లతోనే తీయించాలని.. వారిపై కేసులు పెట్టాలని కమిషనర్ ఆదేశించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ పరిధిలో మట్టి పోసి చెరువులను నింపుతున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో తెల్లాపూర్‌లోని మేళ్ల చెరువు, గండిపేట చెరువులను శనివారం హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మెల్లచెరువు ఎఫ్టీఎల్ పరిధిలో మట్టి పోయడాన్ని స్థానికులు హైడ్రా కమిషనర్‌కు చూపించారు. చెరువు ఎఫ్టీఎల్, బఫర్ పరిధిలో పోసిన మట్టిని వెంటనే తొలగించాలని రాజు యాదవ్ ను ఆదేశించారు. లేని పక్షంలో చర్యలుంటాయని హెచ్చరించారు. గండిపేట చెరువులో హిమాయత్ నగర్ విలేజ్ వైపు మట్టిపోయడాన్ని హైడ్రా కమిషనర్ సీరియస్‌గా పరిగణించారు. వేసిన మట్టిని వెంటనే తొలగించాలని అక్కడ మట్టితో నింపిన డా. ఖుర్షీద్ ను ఆదేశించారు. 48 గంటల్లో మట్టిని తొలగించకపోతే చర్యలుంటాయని హెచ్చరించారు. తమకు గడువు కావాలని.. కోరగా..మరో 24గంటల సమయాన్ని ఇచ్చారు.



చెరువుల స్వరూపాన్ని మార్చితే ఏమాత్రం ఉపేక్షించమని హెచ్చరించారు.

*** జూబ్లీహిల్స్‌లో పార్కు కబ్జాల తొలగింపు..**

జీహెచ్ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్ 36 పరిధిలోని రోడ్డు నంబరు 32లో రెండు ఎకరాలకు పైగా ఉన్న పార్కులో ఆక్రమణలను జీహెచ్ఎంసీతో కలసి హైడ్రా తొలగించింది. పార్కు కబ్జాకు గురైందని.. అందులో అక్రమ కట్టడాలు వచ్చాయని మీడియాలో వచ్చిన వార్తల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్ శనివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వెనువెంటనే ఆక్రమణలను తొలగించడానికి ఆదేశించారు. పార్కుకు ఆనుకుని ఉన్న రెండు ఇళ్లవారు ..వారి వాచ్‌మ్యాన్‌కోసం, ఆవుల కోసం షెడ్డులు వేయడాన్ని కమిషనర్ సీరియస్‌గా పరిగణించారు. పార్కులోకి గేట్లు పెట్టుకోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆ గేట్లను తొలగించి ప్రహరీ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన గేట్‌ను ఏర్పాటు చేసి ప్రజలందరూ పార్కును సందర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ ఆదేశాలతో వెనువెంటనే ఆక్రమణలు తొలగించడం పట్ల అక్కడి స్థానికులు హర్షం వ్యక్తంచేశారు.

*** బుల్కాపూర్ నాలను పునరుద్ధరిస్తాం..**

హుస్సేన్ సాగర్‌కు మంచినీటిని తీసుకు వచ్చే చారిత్రక బుల్కాపూర్ నాలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్ అధికారులకు సూచించారు. మణికొండ ప్రాంతంలో బుల్కాపూర్ నాలా కబ్జాలకు గురౌతోందన్న ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ పరిశీలించారు. శంకరపల్లి లోని బుల్కాపూర్ చెరువు నుంచి ఖానాపూర్, కోకాపేట, నార్సింగ్, పుప్పలగూడ, మణికొండ, దర్గా, షేక్‌పేట్, టోలి చౌకి, పోచమ్మ బస్తీ, చింతలబస్తీ మీదుగా హుస్సేన్ సాగర్‌కు వర్షపు నీరును తీసుకెళ్లే బుల్కాపూర్ నాలా పునరుద్ధరణతో చాలా ప్రాంతాలకు భూగర్భ జలాలు పెంచినట్టు అవుతుందని కమిషనర్ చెప్పారు. ఈ నాలా ఆవశ్యకతను దృష్టిలో పెట్టుకుని పునరుద్ధరించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

# జంట నగరాల అస్తిత్వం దెబ్బతీస్తే ఉపేక్షించం

హైదరాబాద్: సికింద్రాబాద్ కార్పొరేషన్ కోసం బీఆర్ఎస్ ర్యాలీకి సిద్ధమైంది. సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ.. మాజీ మంత్రి తలసాని ఆధ్వర్యంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ఎంజీ రోడ్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు భారీ శాంతి ర్యాలీకి నేతలు బయలుదేరారు.



అయితే.. తమను పోలీసులు అడ్డుకున్నారని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ''జంట నగరాల అస్తిత్వం దెబ్బతీస్తే ఉపేక్షించం. ప్రజలకు నిరసన హక్కు లేకుండా చేశారు. ప్రజల దీవెనలతో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుంది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. తుగ్లక్ పనులు చేస్తోంది'' అని కేటీఆర్ అన్నారు. కోర్టు నుంచి అనుమతి తీసుకుని మళ్లీ ర్యాలీ నిర్వహిస్తామని ఆ పార్టీ నేత తలసాని అన్నారు. తాము నిర్వహిస్తున్నది శాంతియుతమైన ర్యాలీ అని.. అందరినీ ఆహ్వానించినట్లు తెలిపారు. ర్యాలీని అడ్డుకోవడం ప్రభుత్వానికి మంచిది కాదని మండిపడ్డారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి పొంగులేటి

ఖమ్మం జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటనకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి కావాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం రాత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి రేపు (జనవరి 18న) జరగనున్న ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో హెలిప్యాడ్, పైలాన్ ఆవిష్కరణ, నర్సింగ్ కళాశాల వద్ద చేసిన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఎటువంటి తప్పులు జరగకుండా ఏర్పాట్లు పూర్తి కావాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటన లో డిప్యూటీ సీఎం, మంత్రులు, ఇతర వివిఐపి, వీఐపీలు పాల్గొంటారని తెలిపారు. ఈ తనిఖీలో మంత్రి వెంట ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ డా. పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు ఉన్నారు.





# నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల మెరిట్ జాబితా విడుదల

ప్రభుత్వ హాస్పిటళ్లలో ఖాళీల భర్తీ ప్రక్రియ శరవేగంగా జరుగుతోంది. ఇటీవలే 1257 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేసిన మెడికల్, హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు, 2322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి సంబంధించిన మెరిట్ లిస్ట్‌ను శనివారం విడుదల చేసింది. రాత పరీక్షకు హాజరైన ప్రతి అభ్యర్థి సాధించిన మార్కులు, ఇతరత్రా వివరాలను బోర్డు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది. మొత్తం 2322 పోస్టులకుగానూ 1:1.5 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసింది. ఈ లిస్టులో ఉన్న వారికి ఈ నెల 22 నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకూ సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించి, అనంతరం సెలక్షన్ లిస్ట్ విడుదల చేయనున్నారు. వెంగళరావు నగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరగనుండగా... ఎవరెవరు ఎప్పుడు వెరిఫికేషన్‌కు రావాలనే వివరాలను వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవాలని అభ్యర్థులకు బోర్డు సూచించింది. 2024లో 6956 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేసిన ప్రభుత్వం, ఇప్పుడు మరో 2322 పోస్టులను భర్తీ చేస్తోంది. దీంతో ప్రభుత్వ హాస్పిటళ్లలో నర్సింగ్ ఆఫీసర్ల కొరత పూర్తిగా తీరిపోనుంది.

# రాష్ట్రంలో రోహిత్ వేముల చట్టాన్ని తీసుకొస్తాం: డిప్యూటీ సీఎం


రాష్ట్రంలో వీలైనంత తొందరగా రోహిత్ వేముల చట్టాన్ని తీసుకువస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మల్లు అన్నారు. రాష్ట్రంలో రోహిత్ వేముల చట్టం తీసుకురావాలంటూ దేశ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సైతం సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి రోహిత్ చట్టాన్ని తీసుకువచ్చేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని కమిటీకి తెలియజేశారు. జస్టిస్ ఫర్ రోహిత్ వేముల క్యాంపెయిన్ కమిటీ



సభ్యులతో డిప్యూటీ సీఎం శనివారం ప్రజాభవన్‌లో శనివారం సమావేశం అయ్యారు. కర్ణాటక రాష్ట్రంలో రోహిత్ వేముల చట్టం కోసం క్యాంపెయిన్ కమిటీ రూపొందించిన ముసాయిదాను కమిటీ సభ్యులు డిప్యూటీ సీఎంకు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు కొన్ని విజ్ఞప్తులు చేశారు. రోహిత్ వేముల కేసును పారదర్శకంగా విచారణ జరిపించాలని, న్యాయం చేయాలని కోరారు. రోహిత్ వేముల మరణం తర్వాత యూనివర్సిటీలో 50 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్ల పైన నాన్ బెయిలబుల్ కేసులు నమోదయ్యాయని, వారికి విముక్తి కల్పించాలని కోరారు. కర్ణాటక రాష్ట్రం తరహాలోనే తెలంగాణలోనూ రోహిత్ వేముల చట్టాన్ని తీసుకురావాలని కోరారు. సమావేశంలో కర్ణాటక ప్రతినిధులు సీనియర్ అంబేద్కరివాది నాయకుడు, ఉపన్యాసకుడు హులికుంటే మూర్తి నేషనల్ లా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్, డా. ఆశ్నా సింగ్, అడ్వకేట్ వి. మృదుల, ఏఎస్ఏ జీకేవీకే రాహుల్ , హైదరాబాద్ 'జస్టిస్ ఫర్ రోహిత్ వేముల' ఉద్యమం తరఫున రాధికా వేముల, రాజా వేముల, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, ప్రొఫెసర్లు భాంగ్య భుక్య, సౌమ్యా దేచమ్మ, తిరుమల్, రత్నం, హైకోర్టు సీనియర్ అడ్వకేట్ వి. రఘునాథ్, డా. దొంత ప్రశాంత్, ఏఎస్ఏ , హెచ్‌సీయూ తిరుపతి, వెన్నెల పాల్గొన్నారు.

# ముంబయిని తాకట్టు పెట్టాలని చూస్తున్నారు: భాజపాపై ఠాక్రే ఫైర్

మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో స్థానికంగా బలంగా ఉన్న పవార్, ఠాక్రే కుటుంబాలను వెనక్కి నెట్టి భాజపా నేతృత్వంలోని కూటమి ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే తమ కార్యకర్తలతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక ఎన్నికల్లో అవకతవకలు జరిగినందువల్లే భాజపా గెలుపొందిందని ఆరోపించారు. కుట్రపూరితంగా, అక్రమంగా విజయం సాధించిందన్నారు. ముంబయిని పూర్తిగా తాకట్టు పెట్టాలని ఆ పార్టీ ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. ఈ ఒక్క గెలుపుతో తమను నిర్వీర్యం చేశామని భాజపా నేతలు భావిస్తున్నారని, అది ఎప్పటికీ సాధ్యం కాదని ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. యుద్ధం ముగియలేదని.. ఇప్పుడే మొదలయ్యిందని పేర్కొన్నారు. వారి కుట్రలను త్వరలోనే బయటపెడతామన్నారు. ఎన్నికల్లో తమ పార్టీ 64 స్థానాలను కైవసం చేసుకుందని తెలిపారు. ముంబయిలో శివసేన నుంచి మేయర్‌ను నియమించాలనేది తన కల అని.. అదే జరగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు. 227 స్థానాలున్న బృహన్‌ముంబయి (బీఎంసీ) లో అధికారాన్ని కైవసం చేసుకోవడానికి అవసరమైన 114 సీట్ల కన్నా అధికంగానే భాజపా, శివసేన (శిందే)తో కూడిన కూటమి



సీట్లు సాధించింది. భాజపా 89 స్థానాల్లో విజయం సాధించింది. శిందే నేతృత్వంలోని శివసేన 27 చోట్ల గెలుపొందింది. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన 64 స్థానాలను కైవసం చేసుకుంది. రెండు దశాబ్దాల పాటు విడివిడిగా ఉన్న ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రే (మహారాష్ట్ర నవ నిర్మాణ సేన) ఈ ఎన్నికలకు ముందే జట్టుకట్టినా మహాయుతి విజయాన్ని అడ్డుకోలేకపోయారు.



## రాజ్యసభలో ఆ బిల్లు 30ఏళ్లకు పైగా పెండింగులోనే..!

రాజ్యసభలో ప్రస్తుతం 19 బిల్లులు పెండింగులో ఉన్నట్లు తాజా నివేదిక ఒకటి వెల్లడించింది. ఇందులో ఓ బిల్లు 1992 నుంచి పెండింగులో ఉండటం గమనార్హం. ఎగువసభ బులెటిన్ ప్రకారం.. జనాభా నియంత్రణ, చిన్న కుటుంబాలను ప్రోత్సహించేందుకు సంబంధిం చిన బిల్లు ఇది. ఎన్నికల్లో పోటీ చేసే వారికి ఇద్దరు పిల్లల నిబంధనను పొందుపరచగా.. ఇద్దరు కన్నా ఎక్కువ పిల్లలు ఉంటే ఎంపీ లేదా ఎమ్మెల్యేనూ అనర్హులుగా ప్రకటించాలని అందులో ప్రతిపాదించారు. 1997 నాటి దిల్లీ అద్దెల (సవరణ) బిల్లు కూడా సుదీర్ఘకాలంగా పెండింగులోనే ఉంది. ఈ బిల్లుపై పలు భాగస్వామ్య పక్షాల నుంచి వ్యతిరేకత రావడంతో ముందుకు కదల్లేదు. నాణ్యమైన విత్తనాల అమ్మకం, వీటి ఎగుమతి, దిగుమతులకు సంబంధిన సీడ్స్ బిల్లు 2004 నుంచి పెండింగులోనే ఉంది. అంతర్రాష్ట్ర వలస కార్మికులకు సంబంధించిన ఓ బిల్లు 2011 నుంచి ఆమోదానికి నోచుకోలేదు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కార్మిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు దీనిని ప్రవేశపెట్టారు. వీటితోపాటు భవన నిర్మాణ కార్మికుల బిల్లు, ఉపాధి కల్పన కార్యాలయాల బిల్లు సహా పలు బిల్లులు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. లోక్‌సభ రద్దైనప్పుడు పెండింగ్ బిల్లుల గడువు తీరిపోతుంది. వాటిని మళ్లీ ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. కానీ, రాజ్యసభ శాశ్వత సభ.. కాబట్టి ఎప్పటికీ రద్దు కాదు. బిల్లులు సజీవంగా ఉంటాయి.

## ఆ పెన్సిల్ గీతలు ఎంత తప్పో, నేటితరానికి తెలియాలి

: 'దేశ విభజన'పై సుధామూర్తి

జైపుర్: దేశ చరిత్ర, ముఖ్యంగా దేశ విభజనకు దారితీసిన పరిస్థితులను నేటితరం పిల్లలు తప్పనిసరిగా అర్థం చేసుకోవాలని రాజ్యసభ ఎంపీ, ప్రముఖ రచయిత్రి సుధామూర్తి అన్నారు. దేశ విభజన జరగడం తప్పని, భవిష్యత్తులో అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. రాజస్థాన్‌లో జరుగుతోన్న జైపుర్ సాహిత్య వేడుకలో సుధామూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశ విభజనపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. "నీకు చరిత్ర తెలియకపోతే.. భవిష్యత్తును అర్థం చేసుకోలేవు. దేశ విభజన నాటి పరిస్థితులు గుర్తొస్తే.. ఆ పరిణామాల గురించి నేటితరానికి తెలియజేయాలని నేను చాలాసార్లు అనుకున్నా. భారత సంప్రదాయాలు, భాషల గురించి ఏమీ తెలియని ఓ వ్యక్తి పెన్సిల్ (నాటి వైస్రాయ్‌ను ఉద్దేశించి) తీసుకుని గీత గీసి.. ఇవి మీ సరిహద్దులని చెప్పారు. ఆ విభజన కారణంగా పాకిస్థాన్, బంగ్లాదేశ్‌కు వలస వెళ్లినవారి గురించి ఆలోచిస్తే చాలా బాధగా ఉంటుంది. ఓసారి నేను పాకిస్థాన్‌కు వెళ్లినప్పుడు అక్కడి మ్యూజియంకు వెళ్తే విదేశీయురాలినని ఎక్కువ ఛార్జ్ చేశారు. ఒకప్పుడు అది మన అఖండ భారతంలోని భాగమే కదా.. ఇప్పుడు సరిహద్దుల కారణంగా విదేశమైందన్న ఆలోచన నన్ను చాలా బాధ పెట్టింది" అని సుధామూర్తి గుర్తుచేసుకున్నారు. "ఈ భూమి, మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ ఊరికే రాలేదన్న విషయాన్ని ఇప్పటి పిల్లలకు చెప్పాలనుకుంటున్నా. మన పూర్వీకులు ఎంతో కష్టపడి వాటిని సాధించారు. ఎంతోమంది ఇళ్లను కోల్పోయినా.. సంకల్ప బలంతో వారి జీవితాలను పునర్ నిర్మించుకున్నారు. దేశ విభజన కోసం ఆనాడు తీసుకున్న ఓ తప్పుడు



నిర్ణయం ఎన్నోతరాలపై ప్రభావం చూపిస్తోంది" అని సుధామూర్తి వివరించారు. ఈ విషయాలన్నీ యువతరానికి తెలియజేసేందుకు 'ది మ్యాజిక్ ఆఫ్ ది లాస్ట్ ఇయర్‌రింగ్స్' పుస్తకాన్ని రాసినట్లు తెలిపారు. తన మనవరాలు అనౌష్కశర్మను ఆధారంగా చేసుకునే ఈ పుస్తకంలోని ప్రధాన పాత్రను తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు.

## ఎటు చూసినా ఆందోళనలే
## ఇరాన్ పరిస్థితులను వివరించిన భారతీయులు

ఇరాన్ లో పరిస్థితులు క్షీణించడంతో అక్కడ చిక్కుకున్న భారతీయులను విదేశాంగ శాఖ సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చింది. తొలివిడతలో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి తర్వాత పలువురు భారతీయులు దిల్లీకి చేరుకున్నారు. అనంతరం వారు ఇరాన్‌లో పరిస్థితుల గురించి మీడియాతో మాట్లాడారు. ఇరాన్‌లో ఎక్కడ చూసినా ఆందోళనకారులే ఉన్నారని.. ఇంటి నుంచి బయటకు వచ్చే పరిస్థితులే లేవన్నారు. వీధుల్లో నిరసనకారుల మృతదేహాలు, ప్రజల హాహాకారాలతో పరిస్థితులు దారుణంగా ఉన్నాయన్నారు. ఇంటర్నెట్ సదుపాయం నిలిపివేయడంతో తమ పరిస్థితిని కుటుంబసభ్యులకు వివరించే అవకాశం లేక తీవ్ర భయాందోళనకు గురయ్యామన్నారు.



విదేశాంగశాఖ అధికారులను సంప్రదించడానికి కూడా వీలు కాలేదన్నారు. ఈ రెండు వారాలపాటు క్షణమొక యుగంలా గడిచిందన్నారు. తిరిగి భారత్‌కు వస్తామనుకోలేదని.. ఇటువంటి క్లిష్ట సమయంలో తమను సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. తమ వారి కోసం విమానాశ్రయానికి చేరుకున్న కుటుంబసభ్యులు మాట్లాడుతూ.. చాలా రోజులుగా తమ వారితో ఎటువంటి సంప్రదింపులు లేవన్నారు. ఇరాన్‌లో ఉద్రిక్తతల నేపథ్యంలో వారి పరిస్థితిపై తాము ఆందోళన చెందామని.. కానీ మోదీ ప్రభుత్వం చొరవతో తమ కుటుంబసభ్యులు తిరిగి వచ్చినందుకు ఆనందంగా ఉందన్నారు. ఇరాన్‌లో ప్రస్తుతం 10 వేలమందికి పైగా భారతీయులు (విద్యార్థులు సహా) నివసిస్తున్నట్లు అంచనా. వివిధ ప్రాంతాల్లో ఉన్న వీరిని సంప్రదించేందుకు టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయ సిబ్బంది ప్రయత్నాలు చేస్తోంది. అనేక ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవడం, మరికొన్ని ప్రాంతాల్లో అప్పుడప్పుడు పనిచేస్తుండడం ఇందుకు ఇబ్బందికరంగా మారినట్లు తెలుస్తోంది. దీంతో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వారిని చేరుకునేందుకు ఎంబసీ సిబ్బంది ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. అందుబాటులో ఉన్న మార్గాల్లో దేశాన్ని వీడాలని విదేశాంగ శాఖ వారికి సూచించింది. స్వదేశానికి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నవారిని సురక్షితంగా తీసుకురావడానికి చర్యలు తీసుకుంటోంది.



## రిపబ్లిక్ డే అలర్ట్..
## ఉగ్ర ముప్పుపై నిఘా వర్గాల హెచ్చరికలు

దిల్లీ: ఈ ఏడాది గణతంత్ర వేడుకలను లక్ష్యంగా చేసుకొని దిల్లీలో దాడులకు ఉగ్ర సంస్థలు ప్రణాళికలు రచిస్తున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఖలిస్థానీ ఉగ్ర సంస్థలతో పాటు బంగ్లాదేశ్‌కు చెందిన కొన్ని భారత వ్యతిరేక శక్తులు రిపబ్లిక్ డే రోజున దిల్లీ సహా దేశంలోని ప్రముఖ నగరాల్లో దాడులకు ప్రయత్నించవచ్చని తెలిపాయి. దేశ అంతర్గత భద్రతను దెబ్బతీసేందుకు ఖలిస్థానీ, ఇతర రాడికల్ హ్యాండ్లర్లు స్థానిక గ్యాంగ్‌స్టర్లను ఉపయోగించుకుంటున్నారని పేర్కొన్నాయి. హరియాణా, పంజాబ్, దిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్‌లలో ఉగ్రనెట్‌వర్క్‌ను విస్తరిస్తున్నట్లు సమాచారం అందినట్లు తెలిపాయి. గతేడాది దిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడు జరిగిన నేపథ్యంలో నిఘా వర్గాల హెచ్చరికలపై అధికారులు అప్రమత్తమయ్యారు. దిల్లీ సహా ఇతర ప్రముఖ నగరాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేశారు.

## నా బంగ్లాను కూల్చిన వారిని
# ప్రజలు వెళ్లగొట్టారు: కంగనా రనౌత్

మహారాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో భాజపా నేతృత్వంలోని మహాయుతి కూటమి ఘన విజయం సాధించింది. ముఖ్యంగా బృహన్ముంబయి మున్సిపల్ కార్పొరేషన్‌లో అతిపెద్ద పార్టీగా అవతరించింది. దీనిపై భాజపా ఎంపీ, నటి కంగనా రనౌత్ ఆనందం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా గతంలో ముంబయిలోని ఆఫీసు కూల్చివేత ఘటనను గుర్తుచేసుకుంటూ ఉద్ధవ్ ఠాక్రే పార్టీపై విమర్శలు గుప్పించారు. "బీఎంసీ ఎన్నికల్లో భాజపా ఘన విజయం సాధించడం చాలా గొప్ప విషయం. గతంలో నన్ను (ఆఫీసు కూల్చివేతను ఉద్దేశిస్తూ) వేధించిన వారిని, నా బంగ్లాను కూల్చేసిన వారిని, మహారాష్ట్ర నుంచి వెళ్లిపోవాలని నన్ను బెదిరించిన వారిని... ఇప్పుడు రాష్ట్రమే వదిలేసింది. మహిళలపై ద్వేషభావం ఉన్న బంధుప్రీతి మాఫియాకు ప్రజలు సరైన చోటు చూపించారు" అని కంగనా రనౌత్ దుయ్యబట్టారు. 2020లో



ముంబయి లోని బాంద్రాలో గల కంగనా రనౌత్ కార్యాలయంలో కొంత భాగాన్ని అప్పటి బీఎంసీ అధికారులు అక్రమ కట్టడం పేరుతో కూల్చేశారు. దీనిపై అప్పట్లో ఆమె ముంబయి కోర్టును ఆశ్రయించగా.. అధికారుల తీరుపై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. "బీఎంసీది కక్ష సాధింపు చర్యలాగే కన్పిస్తోంది. కంగనాను బెదిరించేందుకే ఆమె కార్యాలయాన్ని కూల్చినట్లుగా స్పష్టంగా తెలుస్తోంది. ఈ చర్యలను తక్షణమే ఆపాలి. నటికి జరిగిన నష్టాన్ని బీఎంసీనే పూడ్చాలి" అని కోర్టు ఆనాడు తీర్పు వెలువరించింది. బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ఆత్మహత్య కేసు దర్యాప్తు గురించి నాడు కంగనా రనౌత్ మాట్లాడుతూ.. మూవీ మాఫియా కంటే ముంబయి పోలీసులంటేనే భయంగా ఉందని పేర్కొన్నారు. అది కాస్తా రాజకీయ దుమారం రేపింది. దీంతో శివసేన నేతలు, నటికి మధ్య కొన్ని రోజుల పాటు మాటల యుద్ధం సాగింది. ఆ సమయంలో ఈ కూల్చివేత చోటుచేసుకోవడం తీవ్ర చర్చనీయాంశమైంది.




## ఇండిగోకు రూ.22.20కోట్ల జరిమానా

దేశీయ విమానయాన సంస్థ ఇండిగోకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ రూ.22.20 కోట్ల జరిమానా విధించింది. గత డిసెంబర్‌లో భారీ సంఖ్యలో విమాన సర్వీసులు రద్దుకావడంపై దర్యాప్తు జరిపిన డీజీసీఏ.. ఈ మేరకు చర్యలు తీసుకుంది. వందలాది విమాన సర్వీసులకు అంతరాయం నేపథ్యంలో నలుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయగా.. నివేదిక ఆధారంగా జరిమానా విధించింది. డిసెంబర్ మొదటి వారంలో 2,507 విమానాలు రద్దు కాగా, 1852 సర్వీసులు ఆలస్యంగా నడిచినట్లు కమిటీ గుర్తించింది. ఇండిగో కార్యకలాపాల నిర్వహణలో.. ప్లానింగ్, ఆపరేషనల్, రెగ్యులేటరీల్లో తీవ్ర లోపాలున్నాయని విచారణలో తేలినట్లు డీజీసీఏ పేర్కొంది. ఓవర్ ఆప్టిమైజేషన్, సాఫ్ట్‌వేర్, నిర్వహణ పర్యవేక్షణలో లోపాలున్నట్లు గుర్తించినట్లు వెల్లడించింది. వీటి కారణంగా డిసెంబర్ 3 నుంచి 5 తేదీల్లో వందలాది విమానాలు రద్దయ్యాయని, దీంతో దేశవ్యాప్తంగా విమానాశ్రయాల్లో మూడు లక్షల మంది ప్రయాణికులు ఇబ్బంది పడ్డారని తెలిపింది. ఇండిగో ఆపరేషన్స్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్‌ను తప్పించాలని ఆదేశించింది.

## మధుమేహుల సంఖ్యలో భారత్‌ది రెండోస్థానం

దిల్లీ: 2024లో భారత్‌లో 9 కోట్ల మంది వయోజనులు మధుమేహంతో జీవించారని ఓ అధ్యయనం తేల్చింది. తద్వారా ఈ రుగ్మత బాధితులు ఎక్కువగా ఉంటున్న దేశాల్లో రెండో స్థానంలో ఉందని పేర్కొంది. 14.8 కోట్ల మందితో చైనా మొదటిస్థానంలో, 3.9 కోట్ల మందితో అమెరికా మూడోస్థానంలో ఉన్నాయని వివరించింది. ఈ అధ్యయనం వివరాలు 'ద లాన్సెట్ డయాబెటిస్ అండ్ ఎండోక్రైనాలజీ' పత్రికలో ప్రచురితమయ్యాయి. అధిక జనాభా కలిగిన చైనా, భారత్, అమెరికా, పాకిస్థాన్ వంటి దేశాలు మధుమేహుల వాటాను ఎక్కువగా కలిగి ఉన్నాయని పరిశోధకులు తెలిపారు. ఈ విషయంలో 2050 నాటికి పాకిస్థాన్.. అమెరికాను దాటేయవచ్చని చెప్పారు. 215 దేశాలకు సంబంధించి 2005 నుంచి 2024 మధ్య జరిగిన 246 అధ్యయనాలను విశ్లేషించి, 2050 నాటి పరిస్థితిపై అంచనాలు వేశారు. 2024లో ప్రపంచవ్యాప్తంగా 20 నుంచి 79 ఏళ్ల మధ్య ఉన్నవారిలో 58.9 కోట్ల మంది మధుమేహం బారినపడ్డారు. ఇది ప్రపంచ జనాభాలో 11 శాతం. 2050 నాటికి ఇది 85.3 కోట్లకు చేరవచ్చు. 2024లో ప్రతి 9 మంది వయోజనుల్లో ఒకరు.. మధుమేహంతో జీవించారు. ప్రపంచవ్యాప్తంగా మధుమేహుల్లో 80 శాతం మంది పేద, మధ్యాదాయ దేశాల్లోనే ఉంటున్నారు.

# మూడో త్రైమాసికంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభాల జోరు

**12 శాతం పెరిగిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నికర లాభం**

**రూ.19,806 కోట్లకు చేరిన ఏకీకృత లాభం**

**ఆస్తుల నాణ్యత మెరుగు.. తగ్గిన స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి**

**రుణాలు, డిపాజిట్లలోనూ కొనసాగిన వృద్ధి**




**న్యూఢిల్లీ:** దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంక్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో బలమైన పనితీరు కనబరిచింది. డిసెంబర్‌తో ముగిసిన ఈ త్రైమాసికంలో బ్యాంక్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 12.17 శాతం పెరిగి రూ.19,806.63 కోట్లకు చేరినట్లు శనివారం ప్రకటించింది. గతేడాది ఇదే కాలంలో బ్యాంక్ లాభం రూ.17,656.61 కోట్లుగా ఉంది.

బ్యాంక్ కీలక ఆదాయమైన నికర వడ్డీ ఆదాయం కూడా 6.4 శాతం పెరిగి రూ.32,615 కోట్లకు చేరుకుంది. ఆస్తుల నాణ్యత విషయంలో బ్యాంక్ పనితీరు మెరుగుపడింది. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి గత ఏడాదితో పోలిస్తే 1.42 శాతం నుంచి 1.24 శాతానికి తగ్గింది. నికర ఔఖంల నిష్పత్తి కూడా 0.46 శాతం నుంచి 0.42 శాతానికి మెరుగుపడింది.

ఈ త్రైమాసికంలో కేటాయింపులు 10 శాతం తగ్గి రూ.2,837.9 కోట్లకు పరిమితం కావడం లాభాల పెరుగుదలకు దోహదపడింది. 2025 డిసెంబర్ 31 నాటికి బ్యాంక్ మొత్తం డిపాజిట్లు 12.2 శాతం వృద్ధితో రూ.27,524 బిలియన్లకు, ఇచ్చిన రుణాలు (అడ్వాన్సులు) 11.9 శాతం వృద్ధితో రూ.28,446 బిలియన్లకు చేరాయని బ్యాంక్ తన ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో వెల్లడించింది. మొత్తం మీద ఆదాయం, లాభాలతో పాటు కీలక వ్యాపార కార్యకలాపాల్లోనూ బ్యాంక్ స్థిరమైన వృద్ధిని నమోదు చేసింది.

# యాడ్స్ విషయంలో కీలక నిర్ణయం తీసుకున్న చాట్‌జీపీటీ

**ప్రకటనల బాట పట్టబోతున్న చాట్‌జీపీటీ**

**నిర్వహణ ఖర్చులను ఎదుర్కొనేందుకు యాడ్స్ ను పరీక్షించనున్నట్లు ప్రకటన**

**ఫ్రీ, తక్కువ స్థాయి సబ్‌స్క్రిప్షన్ వినియోగదారులకు మాత్రమే కనిపించనున్న యాడ్స్**




**న్యూఢిల్లీ:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచంలో సంచలనం సృష్టించిన చాట్‌జీపీటీ ఇకపై ప్రకటనల బాట పట్టబోతోంది. ఓపెన్ ఏఐ విలువ 500 బిలియన్ డాలర్లకు పెరిగినప్పటికీ భారీగా పెరుగుతున్న నిర్వహణ ఖర్చులను ఎదుర్కొనేందుకు వచ్చే కొన్ని వారాల్లో చాట్‌జీపీటీలో అడ్వర్టైజ్‌మెంట్లను పరీక్షించనున్నట్లు ఓపెన్‌ఏఐ ప్రకటించింది. మొదట అమెరికాలో ఫ్రీ, తక్కువ స్థాయి సబ్‌స్క్రిప్షన్ వినియోగదారులకు మాత్రమే ఈ ప్రకటనలు కనిపించనున్నాయి. అయితే ప్రో, ఎంటర్‌ప్రైజ్ యూజర్లకు మాత్రం యథావిధిగా యాడ్స్ ఉండవని సంస్థ స్పష్టం చేసింది.

దాదాపు బిలియన్ మంది వినియోగదారులు ఉన్నప్పటికీ, చాలా తక్కువ మంది మాత్రమే చెల్లింపు సేవలు వినియోగిస్తుండటంతో కొత్త ఆదాయ మార్గాల అవసరం ఏర్పడింది. శక్తిమంతమైన కంప్యూటింగ్ వ్యవస్థల కోసం భారీగా ఖర్చవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ప్రకటనలు చాట్‌జీపీటీ సమాధానాలను ప్రభావితం చేయవని, యూజర్ల వ్యక్తిగత డేటా ప్రకటనదారులకు అందుబాటులో ఉండదని ఓపెన్‌ఏఐ హామీ ఇచ్చింది. యూజర్ నమ్మకం, అనుభవమే తమకు మొదటి ప్రాధాన్యమని సంస్థ మరోసారి స్పష్టం చేసింది.

# చిప్‌ల కొరత ఎఫెక్ట్.. భారీగా పెరగనున్న స్మార్ట్‌ఫోన్లు, టీవీల ధరలు

**ప్రపంచవ్యాప్తంగా మెమరీ చిప్‌లకు తీవ్ర కొరత**

**ఏఐ చిప్‌ల ఉత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వడమే ప్రధాన కారణం**

**స్మార్ట్‌ఫోన్లు, టీవీలు, ల్యాప్‌టాప్‌ల ధరలు భారీగా పెరిగే అవకాశం**

**భారత్‌లో ఎలక్ట్రానిక్స్ అమ్మకాలు 10-12 శాతం తగ్గుతాయని అంచనా**

**2027 వరకు సరఫరా మెరుగుపడే సూచనలు లేవన్న నిపుణులు**



**న్యూఢిల్లీ:** కొత్త స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్ లేదా టీవీ కొనాలనుకునే వారికి ఇది బ్యాడ్ న్యూస్. అంతర్జాతీయంగా నెలకొన్న తీవ్రమైన మెమరీ చిప్‌ల కొరత కారణంగా ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు భారీగా పెరగనున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో పెరిగిన డిమాండ్‌తో చిప్ తయారీ కంపెనీలు తమ ఉత్పత్తిని అటువైపు మళ్లించడమే ఈ సంక్షోభానికి ప్రధాన కారణం. దీంతో సాధారణ వినియోగదారుల కోసం ఉత్పత్తి చేసే గ్యాడ్జెట్లపై తీవ్ర ప్రభావం పడుతోంది.

ప్రపంచవ్యాప్తంగా ఏఐ డేటా సెంటర్ల నిర్మాణం ఊపందుకోవడంతో శాంసంగ్, ఎస్‌కే హైనిక్స్ వంటి ప్రధాన కంపెనీలు అధిక లాభాలనిచ్చే హై-బ్యాండ్‌విడ్త్ మెమరీ చిప్‌ల తయారీకి ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఫలితంగా, స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లలో వాడే డీ-ర్యామ్, నాండ్ ఫ్లాష్ మెమరీ చిప్‌లకు కొరత ఏర్పడింది. ఇప్పటికే కొన్ని రకాల చిప్‌ల ధరలు 60 శాతం వరకు పెరిగాయి. రాబోయే రెండు నెలల్లో స్మార్ట్‌ఫోన్లు, టీవీలు, ల్యాప్‌టాప్‌ల ధరలు 4 నుంచి 8 శాతం వరకు పెరగవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ఈ ప్రభావం ఇప్పటికే భారత మార్కెట్‌పైనా పడింది. వివో, నథింగ్ వంటి కంపెనీలు తమ ఫోన్ల ధరలను రూ.3,000 నుంచి రూ.5,000 వరకు పెంచాయి. ఈ ధరల పెరుగుదల వల్ల 2026లో అమ్మకాలు 10 నుంచి 12 శాతం వరకు తగ్గొచ్చని ఆల్ ఇండియా మొబైల్ రిటైలర్స్ అసోసియేషన్ తెలిపింది. మరోవైపు, ఖర్చు తగ్గించుకునేందుకు కంపెనీలు డిస్‌ప్లే వంటి ఇతర భాగాల నాణ్యతలో రాజీ పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొత్తగా తయారీ ప్లాంట్లు అందుబాటులోకి వచ్చే వరకు అంటే 2027 వరకు ఈ కొరత కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.



# కివీస్‌తో టీ20 సిరీస్ జట్టులోకి శ్రేయస్ అయ్యర్, రవి బిష్ణోయ్...

**వాషింగ్టన్ సుందర్ అవుట్**

**న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌కు భారత జట్టులో మార్పులు**

**గాయంతో ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ సిరీస్‌కు దూరం**

**సుందర్ స్థానంలో జట్టులోకి స్పిన్నర్ రవి బిష్ణోయ్**

**గాయపడిన తిలక్ వర్మ స్థానంలో శ్రేయస్ అయ్యర్‌కు చోటు**

**మొదటి మూడు టీ20లకు మాత్రమే అయ్యర్ ఎంపిక**

**న్యూఢిల్లీ:** న్యూజిలాండ్‌తో జరగనున్న టీ20 సిరీస్‌కు ముందు టీమిండియాలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. గాయాల కారణంగా ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. అతని స్థానంలో స్పిన్నర్ రవి బిష్ణోయ్‌ను జట్టులోకి తీసుకున్నారు. అదే సమయంలో, గాయపడిన తిలక్ వర్మ స్థానంలో స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌ను ఎంపిక చేశారు.

జనవరి 11న వడోదరలో న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో బౌలింగ్ చేస్తుండగా వాషింగ్టన్ సుందర్ పక్కటెముకల నొప్పితో ఇబ్బంది పడ్డాడు. అనంతరం జరిపిన స్కానింగ్‌లో అతనికి 'సైడ్ స్ట్రెయిన్' అయినట్లు నిర్ధారణ అయింది. వైద్యుల సూచన మేరకు కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోనున్న సుందర్, ఆ తర్వాత తదుపరి చికిత్స కోసం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు వెళ్లనున్నాడు. గాయపడిన తిలక్ వర్మ స్థానంలో శ్రేయస్ అయ్యర్‌ను మొదటి మూడు టీ20 మ్యాచ్‌ల కోసం మాత్రమే ఎంపిక చేసినట్లు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మార్పులతో న్యూజిలాండ్ సిరీస్‌కు భారత జట్టు బలాబలాల్లో మార్పులు జరిగాయి.

**భారత టీ20 జట్టు (అప్‌డేటెడ్)**

సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), శ్రేయస్ అయ్యర్ (మొదటి మూడు టీ20లకు), హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), రింకూ సింగ్, జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), రవి బిష్ణోయ్.

# 45 ఏళ్ల వయసులో



**మెల్‌బోర్న్:** టెన్నిస్ దిగ్గజం సెరీనా అక్కడ.. స్టార్ ప్లేయర్ వీనస్ విలియమ్స్ చరిత్ర సృష్టించనున్నది. 45 ఏళ్ల వయసులో ఆమె ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడనున్నది. ఈ విషయాన్ని ఇవాళ కన్ఫర్మ్ చేశారు. ఆ వయసులో గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ ఆడుతున్న తొలి మహిళగా ఆమె గుర్తింపు పొందనున్నది. ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ డ్రాలో 45 ఏళ్ల వయసున్న ప్లేయర్లు ఎవరూ ఇప్పటి వరకు ఆడలేదు. అయిదేళ్ల విరామం తర్వాత మళ్లీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడే ఛాన్సు వీనస్‌కు దక్కింది. వైల్డ్ కార్డు ఎంట్రీ కింద ఆమెకు ఆ అవకాశం కల్పించారు. 1998లో 17 ఏళ్ల వయసులో తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆడింది వీనస్. నాలుగోసారి ఆడినప్పుడు ఆమె క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. గత ఏడాది యూఎస్ ఓపెన్‌లో వీనస్ తన కంబ్యాక్ గ్రాండ్‌స్లామ్ మ్యాచ్ ఆడింది.

ఏడు గ్రాండ్ స్లామ్ టోర్నీలు గెలిచిన వీనస్.. ప్రస్తుతం 576 ర్యాంక్‌లో ఉన్నది. ఈ ఏడాది జరిగిన న్యూజిలాండ్, హోబర్ట్ వార్మప్ టోర్నీల్లో ఆమె ఓటమి పాలైంది. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆదివారం ఆమె తొలి మ్యాచ్ ఆడనున్నది. ఒకవేళ ఫస్ట్ మ్యాచ్ గెలిచినా.. రెండో రౌండ్‌లో ఆమె మూడవ సీడ్ కోకా గాఫ్‌తో తలపడుతుంది.

# అండర్-19ప్రపంచకప్‌లో విచిత్ర రనౌట్..

**పాక్ బ్యాటర్ నిర్లక్ష్యంతో ఇంగ్లండ్ ఘన విజయం!**

**అండర్-19 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ చేతిలో పాకిస్థాన్ ఓటమి**

**చివరి వికెట్‌గా పాక్ బ్యాటర్ అలీ రజా విచిత్ర రనౌట్**

**ఫీల్డర్ త్రో ను తప్పించుకోబోయి క్రీజు వదిలిన బ్యాటర్**

**సమయస్ఫూర్తితో బెయిల్స్ పడగొట్టిన ఇంగ్లండ్ వికెట్ కీపర్**

**ఇంగ్లండ్ 37 పరుగుల తేడాతో విజయం**

**లండన్:** ఐసీసీ అండర్-19 ప్రపంచకప్ 2026 ఆరంభ మ్యాచ్‌లో ఒక విచిత్రమైన సంఘటన చోటుచేసుకుంది. పాకిస్థాన్ బ్యాటర్ అలీ రజా అనూహ్య రీతిలో రనౌట్ అవడంతో ఇంగ్లండ్ 37 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ రనౌట్ క్రికెట్ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది.

జింబాబ్వేలోని తకషింగా స్పోర్ట్స్ క్లబ్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన జరిగింది. ఇంగ్లండ్ నిర్దేశించిన 211 పరుగుల లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ పోరాడుతోంది. ఇన్నింగ్స్




47వ ఓవర్లో చివరి బ్యాటర్‌గా అలీ రజా క్రీజులో ఉన్నాడు. ఒక బంతిని ఆడిన తర్వాత ఫీల్డర్ వికెట్ కీపర్ వైపు బంతిని విసిరాడు. స్ట్రైకర్ ఎండ్‌లో ఉన్న అలీ రజా ఆ బంతి తనను తాకుతుందేమోనని భావించి క్రీజు వదిలి పక్కకు జరిగాడు.

అదే సమయంలో బంతి ఇంకా లైవ్‌లోనే ఉందని గమనించిన ఇంగ్లండ్ వికెట్ కీపర్, కెప్టెన్ థామస్ రివ్ అప్రమత్తమయ్యాడు. అతడు వెంటనే బంతిని అందుకుని వికెట్లను గిరాటేశాడు. దీంతో అలీ రజా రనౌట్‌గా వెనుదిరగాల్సి వచ్చింది. ఈ రనౌట్‌తో పాకిస్థాన్ ఇన్నింగ్స్ 46.3 ఓవర్లలో 173 పరుగుల వద్ద ముగిసింది.

ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్, కాలెబ్ ఫాల్కనర్ (66) రాణించడంతో 210 పరుగులు చేసింది. అనంతరం పాకిస్థాన్ కెప్టెన్ ఫర్హాన్ యూసఫ్ (65) పోరాడినా ఫలితం లేకపోయింది. అలీ రజా ఏకాగ్రత కోల్పోవడం వల్లే ఈ రనౌట్ జరిగిందని, ఇది ఒక "బ్రెయిన్ ఫేడ్" మూమెంట్ అని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ విజయంతో ఇంగ్లండ్ టోర్నీలో శుభారంభం చేసింది.

# మహాకాళేశ్వరుడిని దర్శించుకున్న కోహ్లీ, కుల్దీప్..

**భస్మ హారతి సేవలో టీమిండియా క్రికెటర్లు**

**ఉజ్జయిని:** టీమిండియా క్రికెటర్లు కొందరు శనివారం ఉజ్జయిని మహాకాళేశ్వరుడి సేవలో పాల్గొన్నారు. బోలేనాథుడికి నిర్వహించే భస్మ హారతిలో పాల్గొన్నారు. మేటి బ్యాటర్ విరాట్ కోహ్లీ, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌తో పాటు మరికొంత మంది క్రికెటర్లు మహాశివుడి దర్శనం చేసుకున్నారు. టీమిండియా ఫీల్డింగ్ కోచ్ టీ దిలీప్ కూడా ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ ఆడుతున్న కోహ్లీ.. ఇండోర్‌లో ఆదివారం జరగనున్న మూడవ వన్డే కోసం రెఢీ అయ్యాడు. అయితే శనివారం ఉదయం 4 గంటలకు కొందరు క్రికెటర్లు మహాకాళేశ్వరుడి సన్నిధానికి విచ్చేశారు. నంది హాల్‌లో కూర్చున్న క్రికెటర్లకు పూజారులు తిలకం దిద్దారు. సుమారు రెండు గంటలకు పైగా కోహ్లీ, కుల్దీప్ భస్మ హారతిలో పాల్గొన్నారు. ఆ క్రికెటర్లకు నుదుటిపై పూజారుల గంధం పూశారు. టీమిండియా హెడ్ కోచ్ గౌతం గంభీర్, వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ కూడా మహాకాళేశ్వరుడి ఆశీస్సులు తీసుకున్నారు. జై శ్రీ మహాకాల్ అంటూ విరాట్ కోహ్లీ అన్నారు. మహాకాల్ ఆలయానికి రావడం సంతోషాన్ని ఇచ్చినట్లు కుల్దీప్ చెప్పాడు. టీ20 వరల్డ్‌కప్‌లో రాణించే విధంగా ఆ దేవుడిని ప్రార్థించినట్లు తెలిపాడు.



# సౌత్ స్టార్ హీరో నన్ను అవమానించాడు: తమన్నా



టాకీస్: తెలుగు చిత్ర పరిశ్రమలో మిల్కీ బ్యూటీ తమన్నా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. దాదాపు పదిహేను సంవత్సరాలకు పైగా హీరోయిన్‌గా కొనసాగుతూ, టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌లోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. కథానాయికగా మాత్రమే కాకుండా, ఐటెం సాంగ్స్‌లోనూ తనదైన స్టైల్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో తమన్నా తన కెరీర్‌లో ఎదురైన ఒక చేదు అనుభవాన్ని బయటపెట్టింది. ఒక సినిమా షూటింగ్ సమయంలో తనను ఓ బోల్డ్ సీన్ చేయమని అడిగారని, అందులో ఇంటిమసీ ఎక్కువగా ఉండటంతో తాను అసౌకర్యంగా భావించి నిరాకరించినట్లు చెప్పింది. ఆ విషయం సదరు సౌత్ స్టార్ హీరోకు నచ్చలేదని, సెట్‌లో అందరి ముందే తనపై అరిచి, హీరోయిన్‌ను మార్చేయాలని పేర్కొంటూ, అవమానించాడని తెలిపింది. ఆ సమయంలో తనకు తీవ్రంగా బాధ కలిగిందని తమన్నా వెల్లడించింది. అయితే ఆ హీరో తర్వాత తన వద్దకు వచ్చి క్షమాపణలు చెప్పినట్లు కూడా తెలిపింది. అయినా, ఆ హీరో ఎవరో మాత్రం చెప్పకపోవడంతో అభిమానుల్లో ఆసక్తి, చర్చ మొదలయ్యాయి.

## మన శంకరవరప్రసాద్ గారు రూ.226 కోట్లకు పైగా గ్రాస్ వసూలు




టాకీస్: టాలీవుడ్‌లో సంక్రాంతి సీజన్‌ను పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకున్న సినిమాగా 'మన శంకర వరప్రసాద్ గారు' నిలుస్తోంది. మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా, విజయవంతమైన దర్శకుడు అనిల్ రావిపూడి రూపొందించిన ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ పండగకు విడుదలై థియేటర్లలో జోరుగా సాగుతోంది. ప్రమోషన్ల దశ నుంచే భారీ అంచనాలు ఏర్పడగా, విడుదల తర్వాత ఆ అంచనాలను వసూళ్ల రూపంలో నిజం చేస్తోంది. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో థియేటర్లకు తరలిరావడంతో అన్ని ప్రాంతాల్లోనూ షోలు హౌస్‌ఫుల్ అవుతున్నాయి. వీకెండ్ కావడంతో కలెక్షన్లు మరింత ఊపందుకున్నాయి. ఆన్‌లైన్ టికెట్ బుకింగ్‌లోనూ ఈ సినిమానే ముందంజలో ఉంది. బుక్‌మైషో వేదికగా ఇప్పటివరకు దాదాపు 2.5 మిలియన్ల టికెట్లు అమ్ముడవడం ఈ సినిమాపై ఉన్న క్రేజ్‌కు నిదర్శనం.ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ సినిమా తొలి రోజే భారీ ఓపెనింగ్‌ను నమోదు చేసింది. ఆ తర్వాత రోజురోజుకీ వసూళ్లు పెరుగుతూ మూడో రోజుకు రూ.150 కోట్ల గ్రాస్ మార్క్‌ను, నాలుగో రోజుకు రూ.200 కోట్ల క్లబ్‌ను దాటింది. తాజాగా ఐదు రోజుల కలెక్షన్లను మేకర్స్ అధికారికంగా ప్రకటించగా, ప్రపంచవ్యాప్తంగా రూ.226 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు వెల్లడించారు. ఇది ఒక ప్రాంతీయ సినిమాకు ఆల్‌టైమ్ రికార్డు అని పేర్కొంటూ స్పెషల్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో విడుదల చేశారు.నిర్మాతల ప్రకటనలో 'ప్రతి మార్కెట్‌లో 'మన శంకర వరప్రసాద్ గారు' డామినేషన్ కొనసాగుతోంది. మెగా సంక్రాంతి బ్లాక్‌బస్టర్‌గా ఈ చిత్రం ఐదు రోజుల్లోనే రూ.226 కోట్లకు పైగా గ్రాస్ సాధించింది. ఇది రీజినల్ సినిమా చరిత్రలో అరుదైన ఘట్టం' అని పేర్కొన్నారు. వీకెండ్ మొత్తం సినిమా ట్రెండ్ కొనసాగుతుందని కూడా వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు


## 'యుఫోరియా' అందరికీ కనెక్ట్ అవుతుంది

### ట్రైలర్ విడుదలలో దర్శకుడు గుణశేఖర్




టాకీస్: 'యుఫోరియా'తో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు దర్శకుడు గుణశేఖర్. ఆయన దర్శకత్వంలో భూమిక, సారా అర్జున్, గౌతమ్ వాసుదేవ్ మేనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తోన్న చిత్రమిది . ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా గుణ శేఖర్ మాట్లాడుతూ ఈ సినిమా అందరినీ ఆలోచింపచేస్తుందన్నారు. యుఫోరియా'కు ప్రతి కుటుంబంలో ఒకరు కనెక్ట్ అవుతారు. కొత్త వాళ్లతో ఈ సినిమా చేయాలని 6 నెలలు ఆడిషన్స్ చేశాం. 20 మంది కొత్తవారిని తీసుకున్నాం. టీనేజ్ అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ముఖ్యమైన వయసు. ఈ సినిమాలోని ప్రధాన పాత్రల్లో నటించినవారు అందరూ టీనేజ్ వాళ్లే. కథ వింటున్నప్పుడే సారా అర్జున్ అయితే బాగుంటుందని నిర్మాత నీలిమ చెప్పింది. సారా అర్జున్ నటిస్తేనే ఈ సినిమా తీద్దాం లేదంటే ఆపేద్దాం అని ఆమెతో చెప్పా. రేపు సినిమా చూశాక కూడా అందరూ ఇదే అంటారు. అంత గొప్పగా నటించింది. ఈ అమ్మాయి వయసు 17 ఏళ్లు అయినా.. చాలా ఉన్నతంగా ఆలోచిస్తుంది. ఈ రోజుల్లో ఇలాంటి కథ కచ్చితంగా ప్రేక్షకుల చెప్పాలి అని వెంటనే ఓకే చేసేసిందని అన్నారు. ఇందులో ఎంతో కీలకమైన మరో పాత్ర వింధ్య.. ఈ పాత్ర కోసం భూమికని తీసుకుందాం అని నీలిమ చెప్పగానే వద్దు అన్నాను. ఎందుకంటే భూమికను తల్లి పాత్రలో చూడడం నాకు ఇష్టం లేదు. తను ఎప్పటికీ నాకు ఒక్కడు'లో స్వప్నగానే కనిపిస్తుంది. కానీ, ఆమె అయితేనే ఈ పాత్రకు న్యాయం చేస్తుందనిపించింది. వెళ్లి అడగ్గానే కొడుతుందేమో అనుకున్నా.. స్క్రిప్ట్ చదివి ఓకే చేసింది. కొందరు నటీమణులు కేవలం గ్లామర్ పాత్రలే చేస్తామంటున్నారు. భూమిక ఈ సినిమాలో 17 ఏళ్ల అబ్బాయికి అమ్మగా నటించి వాటిని బ్రేక్ చేసింది. 'యుఫోరియా' రిలీజ్ అయిన తర్వాత ఆమె కచ్చితంగా ప్రశంసలు అందుకుంటుంది. అంటూ గుణశేఖర్ ప్రశంసలు కురిపించారు.

## మరో భిన్నమైన కథతో ధనుష్..కర మూవీ




టాకీస్: రెగ్యులర్ కమర్షియల్ సినిమాలకు పరిమితం కాకుండా, ఎప్పటికప్పుడు కొత్త కథలు, విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తూ వస్తున్న తమిళ స్టార్ ధనుష్ మరోసారి వార్తల్లో నిలిచారు. కథల ఎంపికలో తనకంటూ ప్రత్యేకమైన స్టైల్‌ను కొనసాగిస్తున్న ధనుష్, గత ఏడాది మూడు భాషల్లో సినిమాలు చేసి ప్రేక్షకులను మెప్పించాడు.గత ఏడాది తెలుగులో 'కుబేరా', తమిళంలో 'ఇడ్లీ కడాయ్', హిందీలో 'తేరే ఇష్క్ మేన్' చిత్రాల్లో నటించిన ధనుష్, ఈ మూడింటిలో 'ఇడ్లీ కడాయ్' మినహా మిగిలిన రెండు సినిమాలతో బ్లాక్‌బస్టర్ విజయాలను అందుకున్నాడు. ఈ విజయాలతో మరోసారి తన మార్కెట్‌ను మరింత పెంచుకున్న ఈ హీరో, ఇప్పుడు మరో సరికొత్త పాత్రతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ఆ సినిమానే 'కర'. 'పోర్ తోజిల్' సినిమాతో సూపర్ హిట్ అందుకున్న దర్శకుడు విఘ్నేష్ రాజా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని తాజాగా సంక్రాంతి కానుకగా మేకర్స్ టైటిల్‌తో పాటు టీజర్‌ను విడుదల చేశారు. విడుదలైన టీజర్ ఒక్కసారిగా సినిమాపై అంచనాలను భారీగా పెంచింది.రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ధనుష్ ఇప్పటివరకు చేయని కొత్త రోల్‌లో కనిపించనున్నాడని టీజర్ చూస్తే స్పష్టంగా అర్థమవుతోంది. మట్టి వాసనతో కూడిన కథనం, పవర్‌ఫుల్ ప్రెజెన్స్‌తో ధనుష్ కనిపించిన తీరు అభిమానులను ఆకట్టుకుంటోంది. కథ, పాత్ర పరంగా ఈ సినిమా పూర్తిగా భిన్నంగా ఉండబోతోందనే సంకేతాలు టీజర్‌లో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## హిట్టు కొట్టి చూపించా వచ్చే సంక్రాంతికి మళ్లీ వస్తా: శర్వానంద్

టాకీస్: 'నారీ నారీ నడుమ మురారి'తో చెప్పి మరీ హిట్టు కొట్టాన'ని కథానాయకుడు శర్వానంద్ అన్నారు. ఈ కథ విన్న తొలిరోజు నుంచే ఇది తనకెంతో నమ్మకాన్ని కలిగించిందని.. ఈ సినిమా ఎప్పుడు విడుదల చేసినా తప్పకుండా బ్లాక్‌బస్టర్ అవుతుందని ముందే ఊహించానని.. ఇప్పుడా నమ్మకం నిజమైనందుకు ఆనందంగా ఉందని తెలిపారు. శర్వా హీరోగా నటించిన ఈ సినిమాని రామ్ అబ్బరాజు తెరకెక్కించారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించారు. సంయుక్తా మేనన్, సాక్షి వైద్య కథానాయికలు. నరేశ్, సంపత్ రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఇటీవల విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు.



నిర్మాత దిల్‌రాజు, దర్శకుడు శ్రీను వైట్ల అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో శర్వానంద్ మాట్లాడుతూ.. 'ఇది నాకు చాలా ఎమోషనల్ మూమెంట్. హిట్ కొడతానని చెప్పి మరీ కొట్టాను. సంక్రాంతికి రావాలన్న నా కల నెరవేర్చినందుకు నిర్మాత అనిల్‌కు ధన్యవాదాలు. నేను చాలా రోజులుగా హిట్ కోసం ఎదురు చూస్తున్నా. నాకు ఆ హిట్ ఇచ్చిన దర్శకుడు రామ్ అబ్బరాజుకు కృతజ్ఞతలు. ఈ చిత్రానికి మరో హీరో నరేశ్. మా నాన్న పాత్ర పోషించారు. సినిమా చూసిన వాళ్లంతా 'చాలా రోజుల తర్వాత ఇంతలా నవ్వుకున్నామ'ని చెప్తుంటే ఆనందంగా అనిపించింది. నేనెప్పుడు సంక్రాంతికి వచ్చినా అన్ని సినిమాలు ఆడతాయి. అందుకే ఇకపై ప్రతి సంక్రాంతికి నాకోసం ఒక స్లాట్ పక్కన పెట్టండి ..వచ్చే సంక్రాంతికి మళ్లీ వస్తా. శ్రీను వైట్ల దర్శకత్వంలో మైత్రీ మూవీస్ నిర్మించనున్న నా తదుపరి సినిమా పండక్కే వస్తుందని అన్నారు. పండగ చివర్లో రావడం వల్ల ఎక్కువ థియేటర్లు ఇవ్వలేకపోయాం. కానీ, వచ్చే వారం నుంచి స్క్రీన్స్ పెరగబోతున్నాయి. ఇది చాలా పెద్ద హిట్ కొట్టబోతుందని అన్నారు నిర్మాత దిల్‌రాజు.

## ప్రభాస్ స్పిరిట్‌కు డేట్ ఫిక్స్

### 2027 మార్చి5న విడుదల

టాకీస్: పాన్ ఇండియా స్టార్ ప్రభాస్,సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న 'స్పిరిట్' సినిమాపై రోజురోజుకూ అంచనాలు పెరిగిపోతున్నాయి, గత కొన్ని రోజులుగా ఈ చిత్రం 2027 సంక్రాంతి బరిలో నిలుస్తుందని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయితే, తాజాగా ఈ క్రేజీ ప్రాజెక్ట్ విడుదల తేదీపై చిత్ర యూనిట్ క్లారిటీనిస్తూ ఒక కీలక ప్రకటన చేసింది, అందరూ ఊహించినట్లుగా సంక్రాంతికి కాకుండా, ఈ చిత్రం 2027, మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. సంక్రాంతి రేసు నుండి తప్పకున్నప్పటికీ, మార్చి 5న విడుదల కావడం వల్ల ఈ సినిమాకు లాంగ్ సమ్మర్ సీజన్ ప్లస్ పాయింట్‌గా మారనుంది, పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా ప్రభాస్ కనిపించనున్న ఈ సినిమా కోసం సందీప్ రెడ్డి వంగా ఒక విభిన్నమైన, రా యాక్షన్ డ్రామాను సిద్ధం చేస్తున్నారు. ప్రభాస్ తన కెరీర్లో మొదటిసారిగా ఒక సీరియస్ ఐపీఎస్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతున్నారు. ప్రభాస్ సరసన తృప్తి దిమ్రి కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ కీలక పాత్రలో మెరవనున్నారు. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' వంటి బ్లాక్ బస్టర్ల తర్వాత వంగా తీస్తున్న సినిమా కావడంతో వరల్డ్ వైడ్ మార్కెట్ ఈ చిత్రంపై కన్నేసింది, అధికారిక విడుదల తేదీ వెల్లడి కావడంతో ప్రభాస్ అభిమానులు ఖుషీ అవుతున్నారు. ఇప్పటికే విడుదలైన 'సౌండ్ స్టోరీ' టీజర్ సినిమా ఏ రేంజ్‌లో ఉండబోతుందో హింట్ ఇచ్చింది, ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.